

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 24 ఏప్రిల్ 2021 సంపుటి : 02 | సంచిక : 285 | పేజీలు : 4 | వెల : రూ 3-00

### నరేంద్ర అరెస్ట్ కు నిరసన తెలిపిన టీడీపీ నాయకులు

దర్శి గుంటూరు జిల్లా పొన్నూరు మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర ను అక్రమ అరెస్ట్ చేయడం తాము ఖండిస్తున్నామని ప్రకాశం టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ తెలిపారు .శుక్రవారం దర్శి ఆర్ అండ్ బి బంగ్లా లో మాట్లాడు తూ తాము విచారణకు సహకరిస్తాము అని నరేంద్ర చెప్పిన వినకుండా శుక్రవారం ఉదయం వందల మంది పోలీసులను కోవిడ్ సమయంలో తీసుకెళ్లి అరెస్ట్ చేసి అక్రమంగా నిర్బంధం చేయడం ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు నిదర్శనం అని తెలిపారు .కోవిడ్ సమయంలో 10 వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సెంట్రల్ గవర్నమెంట్, వివిధ రాష్ట్రల లో స్టేట్ గవర్నమెంట్ పరీక్షలు నిలిపితే మన రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి తో సుమారు 15 లక్షల మంది విద్యార్థులు తో ఆటలాడుతున్నారు ఆవేదన వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో దర్శి మండలం మాజీ ప్రధాన కార్యదర్శి రాచపూడి మోసే, పావని కిరణ్,పర్వతనేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 'సున్నా వడ్డీ నగదు జమ చేసిన సీఎం జగన్




పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ నగదు
ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సీఎం
మహిళా సాధికారత మా నినాదం కాదు.. మా విధానం
మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది
గత ప్రభుత్వం రుణాల పేరుతో మహిళలను మోసం చేసింది
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి ( విభారె) : ఇవాళ మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 1.02 కోట్ల మందికిపైగా పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై ప్రతి నెలా వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ వరుసగా రెండో ఏడాది కూడా చెల్లించింది. ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ శుక్రవారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలకు అండగా నిలబడ్డామని పేర్కొన్నారు."మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలబడుతూ వస్తున్నాం. మహిళా సాధికారితను ఆచరణలోకి తీసుకురాగలిగాం. బ్యాంకుల ద్వారా నేరుగా సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నాం. డ్వాక్రా సంఘాల అప్పుపై ఈ ఏడాది వడ్డీ రూ.1109 కోట్లు చెల్లిసున్నాం. మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నాం. అక్కాచెల్లెమ్మలకు వ్యాపారపరంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. మహిళా సాధికారత మా నినాదం కాదు.. మా విధానం. గత ప్రభుత్వం రుణాల పేరుతో మహిళలను మోసం చేసిందని సీఎం వైఎస్ జగన్ అన్నారు.దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా.. మహిళలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు ఇచ్చేలా చట్టం చేశామని సీఎం పేర్కొన్నారు.



రాష్ట్రంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం ఎక్కడా రాజీ లేకుండా కృషి చేస్తున్నామని.. రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. మహిళల కేసులు వాదించేందుకు ప్రత్యేక పీపీలను నియమించామని పేర్కొన్నారు. 900 కొత్త వాహనాలను కొనుగోలు చేశామన్నారు. మద్య నియంత్రణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# ఏపీలో ఉచితంగా వ్యాక్సిన్

18-45 ఏళ్ల లోపు వారికి ప్రభుత్వ ఖర్చుతోనే వ్యాక్సిన్
ఏప్రిల్ 24 నుంచి ఏపీలో నైట్ కర్ఫ్యూ


అమరావతి:( విభారె) కరోనా కట్టడికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో 18 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. మే 1 నుంచి దేశవ్యాప్తంగా 18 ఏళ్లు పైబడిన వారికి వ్యాక్సిన్ ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఖర్చుతోనే ప్రజలకు వ్యాక్సిన్ ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 18-45 ఏళ్ల మధ్య వారు సుమారు 2,04,70,364 మంది ఉన్నారు. వీరందరికి ఏపీ సర్కార్ ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వనుంది. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని మాట్లాడుతూ.. "కరోనా కట్టడిపై సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన విస్తృతంగా చర్చించాము. ప్రజల భాగస్వామ్యంతో పాటు వాక్సినేషన్ ముఖ్యమని సీఎం చెప్పారు. రాష్ట్రంలో వాక్సినేషన్ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నాం. 18-45 వయసు ఉన్న వారికి ఉచితంగా టీకా వేస్తాం. ఇందుకు గాను 1600 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నాం. అలానే కరోనా కట్టడి



కోసం రేపటి నుంచి రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు నైట్ కర్ఫ్యూ అమల్లోకి రానుందివవ అని మంత్రి తెలిపారు."సీటీ స్కాన్ పేరుమీద దోపిడీ చేయడంపై ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. దీనికి 2,500 రూపాయల ధర నిర్ణయించాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు. ఇప్పటికే కొన్ని ఆస్పత్రులపై చర్యలు తీసుకున్నాం. ఇది నిరంతరం జరుగుతుంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దోపిడీకి పాల్పడవద్దని వినతి. మాస్క్, భౌతిక దూరం వంటి కోవిడ్ నియమాల అమలులో ప్రజలను భాగస్వామ్యం చేయమని సీఎం జగన్ సూచించారు. కళ్యాణ మండపాలను కోవిడ్ కేర్ సెంటర్లుగా మార్చాలని సీఎం ఆదేశించారు. బెడ్స్, కోవిడ్ రిక్రూట్మెంట్ కూడా పెంచుతున్నాం. జిల్లా స్థాయిలో 104 కాల్ సెంటర్లకు జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని నియమించాలని కోరామువవ అని మంత్రి తెలిపారు.

## ఆక్సిజన్ అందక గాల్లో కలుస్తున్న ప్రాణాలు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : కరోనా మహమ్మారి సెకండ్ వేవ్ విరుచుకుపడటంతో ఆక్సిజన్ అందక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆక్సిజన్ కొరత, రా(ష్ట్రాల మధ్య ఆక్సిజన్ సరఫరాలను పర్యవేక్షించాలని సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ తరపున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ను సర్వోన్నత న్యాయస్థానం కోరింది. ఆక్సిజన్ అందక ప్రజలు



మరణిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ ఏ బాబ్డే సారథ్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.దేశంలో కరోనా వైరస్ సంక్షోభం, లాక్డౌన్ లను ప్రకటించేందుకు హైకోర్టుల అధికారంపై సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయని కోర్టు.. విపత్తు వేళ కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్న అత్యవసర పరికరాల సరఫరా, ఆక్సిజన్ సరఫరాలపై బదులివ్వాలని కోరుతూ ఏప్రిల్ 27కు విచారణను వాయిదా వేసింది. కొవిడ్-19 వ్యవహారంపై హైకోర్టులు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు వారించడం లేదని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం హైకోర్టులు ముందుకు తెచ్చిన అంశాలపై నివేదించాలని కేంద్రాన్ని కోరినట్టు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## 30వ తేదీకి వాయిదా పడిన పరిషత్ కౌంటింగ్

విజయవాడ, ఏప్రిల్ 23,( విభారె) )పీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ ఎన్నికలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై ఇవాళ విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 30న విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది. మంగళవారం జరిగిన విచారణలో కోర్టు ఆదేశాల మేరకు పిటిషన్లు లిస్ట్ కాలేదని.. అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఎస్ఈసీ తరపున లాయర్ కోరారు. న్యాయమూర్తి శుక్రవారం పిటిషన్లపై విచారణ జరుపుతామన్నారు.. మళ్లీ ఇప్పుడు నెలాఖరుకు వాయిదా వేశారు.ఈ నెల 1న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఎస్ఈసీ షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 8న పోలింగ్, 10న ఫలితాలు వెల్లడించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 6న హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే ఇచ్చింది. హైకోర్టులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 4 వారాల ఎన్నికల కోడ్ విధించలేదని పిటిషనర్లు వివరించారు. 7 రోజుల్లో ఎలా ఎన్నికలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధించింది. మంగళవారం సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఎస్ఈసీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది.ఈ నెల 7న సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్ని డివిజన్ బెంచ్ కొట్టేసింది.. ఈ సమయంలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం చెప్పింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ ఫలితాలను మాత్రం వెల్లడించొద్దని సూచించింది. సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చే తీర్పుకు లోబడి ఉండాలని ఆదేశించింది. ఈ నెల 8న పోలింగ్ జరగ్గా.. ఫలితాలు వాయిదా పడ్డాయి. ఎన్నికల కౌంటింగ్‌పై హైకోర్టులో ఈ నెల 15న విచారణ జరగ్గా.. ఎస్ఈసీ మూడు పిటిషన్లలో రెండింటింకి మాత్రమే కౌంటర్ దాఖలు చేసింది.. మూడో పిటిషన్ కౌంటర్ దాఖలుకు సమయం కోరింది. దీంతో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసింది. మళ్లీ కోర్టులో ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది.. మళ్లీ శుక్రవారానికి వాయిదా పడింది.. అది కాస్తా ఈ నెల 30కు వెళ్లింది.

# సీఎంలతో ప్రధాని భేటీ

దుమారం రేపిన కేజ్రీవాల్ కామెంట్స్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)దేశంలో కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న పది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నిర్వహించిన సమావేశం రాజకీయ దుమారానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ సమావేశాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రిఅరవింద్ కేజ్రీవాల్ రాజకీయ వేదికగా చేసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. ఆయన ప్రసంగం పరిష్కారం సూచించే దిశగా లేదని, బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నంగా ఉందని దుయ్యబట్టాయి. ఒక్క వ్యాక్సిన్ డోస్ కూడా ఉంచుకోకుండా రాష్ట్రాలకు కేంద్రం అందజేస్తోందన్న విషయం తెలిసి కూడా టీకా ధరలపై కేజ్రీ అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేశారని విమర్శించాయి.ఎయిర్ లిఫ్టింగ్ ఆక్సిజన్ అంశాన్ని కేజ్రీ ప్రస్తావించారని, వాస్తవానికి ఇప్పటికే ఎయిర్‌లిఫ్ట్ ద్వారా ప్రాణవాయువును కేంద్రం సరఫరా చేస్తోందని వ్యాఖ్యానించాయి. "కేజ్రీవాల్ చాలా తక్కువ స్థాయికి దిగజారిపోయారు.. సీఎంలతో ప్రధాని ప్రైవేటు సంభాషణను ఆయన బయటకు వెల్లడించారు.. ఆయన ప్రసంగం మొత్తం ఏమాత్రం పరిష్కారం చూపించలేదు. రాజకీయాలు చేస్తూ, బాధ్యతను విస్మరించారు'అని ప్రభుత్వ వర్గాలు విమర్శలు గుప్పించాయి.ప్రధానితో జరిగిన సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆక్సిజన్ కొరత తీవ్రంగా ఉందనే విషయాన్ని ప్రస్తావించారు. "ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ లేకపోతే ఢిల్లీ ప్రజలకు ఆక్సిజన్ దొరకదా? దీనిపై కేంద్ర ప్రభుత్వంలో ఎవరితో మాట్లాడాలో దయచేసి సూచించండి.. ఢిల్లీ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరతతో విషాదకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.. ఈ విషయంలో మీ గైడెన్స్ అవసరం ప్రధాని సర్" అని పేర్కొన్నారు." నగరం మొత్తానికి ఆక్సిజన్ సరఫరా నిలిచి పోయింది... ఆక్సిజన్ కొరత కారణంగా పెను విషాదం సంభవిస్తుందని మేము భయపడుతున్నాం.. అదే జరిగితే మనల్ని మనం ఎప్పటికీ క్షమించుకోలేం. .ఆక్సిజన్ కొరత సమస్యను పరిష్కరించేం దుకు కఠిన చర్యలు తీసుకోవాలి.. ఢిల్లీకి వచ్చే ఆక్సిజన్ ట్యాంకర్ల సజావుగా సాగేలా ఆదేశించాలని నేను చేతులు జోడించి మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కేజ్రీవాల్ అన్నారు.

## దూళిపాళ్ల నరేంద్రను తక్షణమే విడుదల చేయాలి


-చంద్రబాబు నాయుడు

అమరావతి ( విభారె) సంగం డైరీని దెబ్బతీసి అమూల్ కు కట్టబెట్టే కుట్రలో భాగంగానే దూళిపాళ్ల నరేంద్ర అక్రమ అరెస్ట్ చేసారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. టీడీపీ నేతలే లక్ష్యంగా వేధింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అయన అన్నారు. దూళిపాళ్ల నరేంద్ర అక్రమ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నా. స్థానిక రైతులు భాగస్వామిగా ఉండే సంగం డైరీని నిర్వీర్యం చేసి గుజరాత్ కు చెందిన అమూల్ కు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే టీడీపీ సీనియర్ నేత దూళిపాళ్ల నరేంద్రపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. పొరుగు రాష్ట్రానికి చెందిన అమూల్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని ఇక్కడి



సంస్థలను దెబ్బతీస్తున్నారు. రెండేళ్ల పాలనలో అభివృద్ధి లేదు కానీ.. అక్రమ అరెస్ట్ లు మాత్రం ఉంటున్నాయని అయన ఆరో?పించారు. ప్రజా సమస్యలు బయటకు వచ్చిన ప్రతిసారి టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు వంటి నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కరోనా నియంత్రణలో విఫలమవడంతో ప్రజలను పక్కదారి పట్టించడానికే టీడీపీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ప్రశ్నించిన ప్రతి ఒక్కరిని అక్రమ అరెస్ట్ లు చేయించుకుంటూ పోతే రాష్ట్రంలో ఎవరూ మిగలరని జగన్ రెడ్డి గుర్తించాలి. దూళిపాళ్ల నరేంద్రను తక్షణమే విడుదల చేయాలని అయన డిమాండ్ చేసారు.

## పైశాచిక ఆనందంలో సీఎం జగన్: దేవినేని ఉమా



విజయవాడ:( విభారె) సీఎం జగన్‌పై మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రశ్నించే గొంతులను, ప్రతిపక్షనేతలను తొక్కిపెట్టడం ద్వారా ఈ ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ప్రజలంతా కరోనాతో బిక్కుబిక్కుమంటుంటే, ముఖ్యమంత్రి మాత్రం రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. తెల్లవారుజామున ధూళిపాళ్ల నరేంద్ర ఇంటికెళ్లి, ఒక బందిపోటుని, గూండాను అరెస్ట్ చేసినట్లు ఆయన్ని అరెస్ట్ చేశారన్నారు. సంగం డెయిరీని స్థాపించి పాడిరైతులకు అండగా ఉండటమే నరేంద్ర చేసిన తప్పా? సంగం డెయిరీని రూ.1100కోట్ల టర్నోవర్ సాధించే స్థాయికి తీసుకెళ్లడమే నరేంద్ర చేసిన తప్పా? ప్రభుత్వం తప్పుడు కేసులను ఎత్తిచూపి, వాస్తవాలు బయటపెట్టడంతో, ముఖ్యమంత్రి ఆయనపై కక్ష కట్టారన్నారు. అమూల్‌ను భుజానికెత్తుకున్న ముఖ్యమంత్రి, నరేంద్రను లక్ష్యంగా ఎంచుకున్నారని వ్యాఖ్యానించారు. సంగం డెయిరీలో లేని అవినీతిని ఉన్నట్లుచూపడానికి జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అక్రమ కేసులు, తప్పుడు కేసులతో ముఖ్యమంత్రి ఒక శాడిజంతో, పైశాచిక ఆనందంతో, సైకోలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అమరావతి భూముల వ్యవహారంలో చంద్రబాబు నాయుడు, మాజీమంత్రి నారాయణలపై పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని నరేంద్ర ఆధారాలతో సహా నిరూపించారన్నారు. దాంతో ముఖ్యమంత్రి నరేంద్రను టార్గెట్‌గా చేశారన్నారు. నరేంద్రను తక్షణమే మీడియాసాక్షిగా కోర్టులో హాజరుపరచాలని, లేకుంటే టీడీపీ తరుపున పెద్దఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తన దోపిడీకోసం జగన్మోహన్ రెడ్డి పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌గా మార్చేశారని, అంచనా వ్యయాన్ని పెంచి రాత్రికి రాత్రి జీవోలిచ్చి, రూ.3222కోట్లకు ఎసరు పెట్టారన్నారు.

## ఏపీలో మరోసారి ఎన్నికలు..?

కడప, ఏప్రిల్ 23, (( విభారె) బద్వేల్ ఉప ఎన్నిక అనివార్యం. సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య మరణంతో ఆరు నెలల్లో బద్వేలు నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. వైసీపీ అధినేత జగన్ఇప్పటికే బద్వేల్ ఉప ఎన్నికల్లో వెంకట సుబ్బయ్య కుటుంబ సభ్యులకే టిక్కెట్ కేటాయించే అవకాశాలున్నాయి. ఈ మేరకు జగన్ వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ టీడీపీ బరిలో ఉంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక తర్వాత వస్తున్న అసెంబ్లీ ఉప ఎన్నిక ఇది. సంప్రదాయం ప్రకారం అయితే మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకే అవకాశమిచ్చినప్పుడు విపక్షాలు పోటీకి దూరంగా ఉండాలి. అయితే తిరుపతి ఉప ఎన్నికల్లో ఈ సంప్రదాయానికి తెరపడింది. ఇప్పుడు గతంలో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నంద్యాల ఉప ఎన్నికల్లో సంప్రదాయాన్ని పాటించలేదు. దీంతో తిరుపతి ఉప ఎన్నికలో అన్ని పార్టీలూ పోటీ చేశాయి.బద్వేల్ లోనూ అదే పద్ధతిని పాటిస్తాయంటున్నారు. బద్వేల్ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా కడపలో ఉంది. అయినా బద్వేల్ లో టీడీపీకి మంచి ట్రాక్ రికార్డు ఉంది. 1983, 1985, 1994, 1999 ఎన్నిలకలో ఇక్కడ టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. అయితే అప్పటి వరకూ బద్వేల్ నియోజకవర్గం రిజర్వడ్ నియోజకవర్గం కాదు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం అయిన తర్వాత బద్వేల్ లో టీడీపీ ఇంతవరకూ విజయం సాధించలేదు. ఇక్కడ కాంగ్రెస్, వైసీపీలే గెలుస్తూ వస్తున్నాయి.మొన్న మున్సిపల్ ఎన్నికల్లోనూ కడప జిల్లా మైదుకూరులో వైసీపీకి టీడీపీ గట్టి పోటీ ఇచ్చింది. దీంతో చంద్రబాబు బద్వేల్ నియోజకవర్గంలో మరోసారి తాము సత్తా చాటాలని భావిస్తున్నారు.

# సంపాదకీయం

**శనివారం 24 ఏప్రిల్ 2021**

## మళ్లీ వాణిజ్య యుద్ధం....

చమురు దిగుమతి చేసుకొనే దేశంగా ఉన్న అమెరికా ఇటీవలి కాలంలో షేల్ ఆయిల్ ఉత్పత్తి కారణంగా చమురు ఎగుమతి దేశంగా మారిపోయింది. అమెరికాతో మన వాణిజ్యం కొద్దిగా మిగులులో ఉంది. కనుక తమ కంపెనీల నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు, ఆయుధాలతో పాటు చమురు కూడా కొంటా రా లేదా అని అది వత్తిడి చేస్తోంది. పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలు మనకు ఎప్పుడూ మిత్రులుగానే ఉన్నాయి తప్ప శత్రువులు కాదు. గల్ఫ్ దేశాల నుంచి కొనుగోళ్లు తగ్గించి ఆమేరకు అమెరికా చమురు కొనాలంటే ఏదో ఒకసాకు కావాలి. సౌదీ అరేబియా ఇటీవల చమురు ఉత్పత్తిని తగ్గించిన కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగాయి. తగ్గినపుడు ఆ మేరకు మన జనానికి తగ్గించకుండా పన్నులు వేసి ఆ మొత్తాలను అదానీ, అంబానీల వంటి కార్పొరేట్లకు పన్నుల రాయితీల రూపంలో మూటగట్టి మరీ ఇచ్చారు, ఇస్తున్నారు. ఇప్పుడు చమురు ధరలు పెరిగితే ప్రస్తుతం నరేంద్ర మోడీ మత్తులో ఉన్న జనానికి అది వదిలిన తరువాత ఏం జరుగుతుందో అందరి కంటే నరేంద్ర మోడీకే బాగా తెలుసు గనుక చమురు ఎగుమతి దేశాల మీద రుసరుసలాడుతున్నారు. మా దగ్గర కారుచవకగా కొన్న చమురు ఉంది కదా ఆమేరకు మీ వినియోగదారులకు భారం తగ్గించండి అని సౌదీ అరేబియా సలహాయిచ్చింది. దాన్ని సాకుగా తీసుకొని వేరే మార్కెట్లలో కొనుగోలు చేయాలని మన చమురు కంపెనీలను కోరారు. పోనీ ఆ వేరే మార్కెట్లలో మన లావు పాత పోలిక వద్దు లెండి ఇప్పుడు గడ్డం పొడవు చూసి అనాలేమో ! తక్కువ ధరలకు ఏమైనా ఇస్తాయా ? ఒక్క సెంటు(మన ఏడు పైసలకు సమానం) కూడా తగ్గించవు. అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధరల ప్రకారమే, డాలర్లు మరీ చెల్లించి మనం కొనుక్కోవాలి, మన పొరుగునే ఉన్న గల్ఫ్ నుంచి రవాణా ఖర్చులు తక్కువ, అదే అమెరికా నుంచి కొనుగోలు చేస్తే తడచిమోపెడంత అవుతాయి? తనది కాదు గనుక తాటిపట్ట వేసి గోక్కోమన్నాడట వెనుకటికెవడో ! అలాగే కేంద్ర పెద్దలదేముంది, భరించేది మనమే కదా ఎంతైనా, ఎక్కడి నుంచైనా తెస్తారు? చమురు కార్పొరేట్లతో వారి సంబంధాలు ముఖ్యం కదా !మన ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా స్నేహం పట్టినప్పటి నుంచీ కొంత చమురును మన రూపాయల్లో కొనే వెసులుబాటు కల్పించిన ఇరాన్‌ను వదలిపెట్టి అమెరికన్లను మెప్పించేందుకు చమురు కొనుగోళ్లను ఎలా పెంచారో తెలుసా? 2017-18లో రోజుకు 38 వేల పీపాల చమురు అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నాము. 2021 ఫిబ్రవరిలో ఆ మొత్తం 5,45,300 పీపాలకు పెరిగింది. ప్రస్తుతం 8,67,500 పీపాలతో మొదటి స్థానంలో ఉన్న ఇరాక్ నుంచి దిగుమతులను గణనీయంగా తగ్గించి అమెరికా మీద అధికంగా ఆధారపడే విధంగా మోడీ వేగంగా ప్రయాణిస్తున్నారు. మన పశ్చిమాసియా మిత్ర దేశాలతో చమురు వైరుధ్యం తెచ్చుకొని ఆ దారులన్నీ మూసుకున్న తరువాత అమెరికా ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చోవాలి, ఎక్కడ, ఎలా నిలబడమంటే అలా నిలబడాల్సిన రోజు వచ్చినా ఆశ్చర్యం లేదు. మన చమురు ఆయుధాన్ని మన మీదే ప్రయోగిస్తే చేయగలిగిందేమీ లేదు విదేశాలకు చెందిన సంస్థలు మన దేశంలో డిజిటల్ సేవలను అందించి వ్యాపారం చేస్తున్నపుడు దానికిగాను డిజిటల్ సర్వీసు టాక్సు(డిఎస్‌టి) చెల్లించాలని మన దేశం 2016లోనే అనేక దేశాలతో పాటు ఆదాయం మీద ఆరు శాతం పన్ను విధించాలని నిర్ణయించింది. అయితే అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల వత్తిడి మేరకు మోడీ సర్కార్ దాన్ని ఆన్‌లైన్ ప్రకటనల సేవలకు మాత్రమే పరిమితం చేసింది. తరువాత అన్ని రకాల డిజిటల్ సేవలకు గాను రెండు శాతం చెల్లించాలని గత ఏడాది మార్చి నెలలో 2020 ఫైనాన్స్ చట్టం ద్వారా నిర్ణయించింది. అలాంటి సేవలందించే సంస్థలలో అత్యధిక భాగం అమెరికాకు చెందినవే. మన దేశం విధించిన పన్ను పరిధిలోకి వివిధ దేశాలకు చెందిన 119 సంస్థలు వస్తాయి, వీటిలో కేవలం అమెరికా నుంచే 86 ఉన్నాయి. ఈ పన్ను అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం, అమెరికా వాణిజ్య సంస్థల పట్ల వివక్ష చూపటమే అని అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచ వ్యాపితంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దశలో ఏ దేశమూ దాని ద్వారా రావాల్సిన ఆదాయాన్ని వదులుకోజాలదు. మన దేశ వినియోగదారులతో విదేశీయులు జరిపే ప్రతిలావాదేవీకి ఈ పన్ను వర్తిస్తుంది.. 1974 వారు చేసిన అమెరికా వాణిజ్య చట్టంలోని 301 సెక్షన్ ప్రకారం ఏ దేశమైనా అమెరికా వాణిజ్యానికి వ్యతిరేకమైన చర్యలు తీసుకున్నదని భావిస్తే తమ స్వంత చట్టం ద్వారా విచారణ జరుపుతారట. ఆ మేరకు చర్యలు కూడా తీసుకుంటారు. మన దేశం విధించిన డిఎస్‌టి అమెరికా, తదితర విదేశీ డిజిటల్ సంస్థలకు మాత్రమే వర్తింపచేస్తూ భారతీయ సంస్థలకు మినహాయింపు ఇవ్వటం వివక్ష కిందకు వస్తుందన్నది ఒక అభ్యంతరం. ఉదా? అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి వాటితో పాటు అంబానీ, అదానీ కంపెనీలు డిజిటల్ సేవలు అందించినా ఈ చట్టం ప్రకారం అదానీ, అంబానీలు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. రెండవది కొన్ని నాన్ డిజిటల్ సేవా సంస్థలు డిజిటల్ సేవల మాదిరి వాటిని అందచేసినా వాటికి మినహాయింపు ఇవ్వటం వివక్షాపూరితం అన్నది అమెరికా అభ్యంతరం. దీన్ని మన దేశం అంగీకరించలేదు. ఏ కంపెనీ అయినా మన దేశంలో శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే దానికి మన దేశంలోని పన్ను చట్టాలు వర్తిస్తాయి. గనుక వాటి మీద మరొక పన్ను విధించాల్సిన అవసరం లేదన్నది మన వాదన. అమెరికా సంస్థలు ఏవైనా మన దేశంలో శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే అదే సూత్రం వర్తిస్తుంది. ఎలాంటి పన్నులు చెల్లించకుండా మన సేవల ద్వారా లాభాలు పొంది వాటిని తమ దేశాలకు తరలించుకుపోవాలన్నది విదేశీ కార్పొరేట్ శక్తుల ఎత్తుగడ. చైనా, భారత్ వంటి దేశాలలో పెద్ద ఎత్తున డిజిటల్ సేవలను విస్తరిస్తున్నందున వాటి నుంచి పన్ను ఆదాయం రాబట్టకుండా ఆర్థిక వ్యవస్థలు నడవవు. అనేక దేశాలు వివిధ రూపాలలో వస్తు, సేవల మీద పన్నులు వసూలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు చైనాలో డిఎస్‌టి లేదు. చైనాకు చెందిన అలీబాబా వంటి సంస్థలు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. చైనాలో ప్రస్తుతం 18 రకాల పన్నులు ఉన్నాయి. డిజిటల్ సేవల మీద కూడా పన్ను విధించాలనే ఆలోచన చేస్తున్నారు. అక్కడ కూడా అమలు చేస్తే ప్రస్తుతం సాగుతున్న వస్తు,సేవల వాణిజ్య యుద్ధం డిజిటల్ సేవల వాణిజ్యానికి కూడా విస్తరించవచ్చు.

# కొణిదెల బ్రదర్స్ మధ్య జగన్ చిచ్చు

విజయవాడ, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)జగన్ ఏపీకి సీఎం. మెగా బ్రదర్స్‌తో ఆయనకు ఏం పని అన్న ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. కానీ రాజకీయాలకు సంబంధం లేని రంగం లేదు కదా. పైగా మెగాస్టార్ చిరంజీవి తమ్ముడు పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఉన్నారు. ఆయన జనసేన పార్టీ అధినేత కూడా. ఇక పవన్ జగన్ ని గట్టిగా ద్వేషిస్తారు. కానీ మెగాస్టార్ చిరంజీవి మాత్రం జగన్ సర్కార్ ఏమి మంచి పని చేసినా మెచ్చుకుంటారు. పైగా జగన్ ఇంటికి వెళ్ళి విందారగించి వచ్చిన మంచితనం చిరంజీవిది. ఇటీవల జగన్ సర్కార్ సినీ పరిశ్రమకు కొన్ని రాయితీలు ప్రకటించింది. సినీ ఎగ్జిబిటర్లకు విద్యుత్ రాయితీలతో పాటు వారి రుణాలకు వడ్డీ రాయితీలను ప్రకటించింది. అలాగే వారు కట్టాల్సిన వాటి మీద మారిటోరియాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించింది. దీని మీద సినీ పెద్దగా మెగాస్టార్ జగన్ ని మెచ్చుకున్నారు. సినీ పరిశ్రమకు అందిస్తున్న వరాలుగా ఆయన అభివర్ణించారు. అయితే ఇది పవన్ ఫ్యాన్స్ కి తప్పుగా అనిపించింది. అంతే వారు ఏకంగా చిరంజీవినే సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేయడం మొదలెట్టారు. చిరంజీవి వల్లనే పవన్ రాజకీయం ఇబ్బందులో పడుతోంది అని కూడా హాట్ కామెంట్స్ కూడా పెట్టారు. పవన్ జగన్ ని వ్యతిరేకిస్తూంటే చిరంజీవి పొగడడం ఏంటి అని కూడా మండిపోతున్నారు. ఇక్కడొక విషయం ఏంటి అంటే చిరంజీవి సినీ పెద్దగా మాత్రమే జగన్ ని పొగిడారు. అది అవసరం కూడా. పైగా మంచి పని ఒక ప్రభుత్వం చేస్తే మెచ్చుకోకుండా ఉంటే అది కుసంస్కారమే. ఇక చిరంజీవి వ్యక్తిగతంగా చూస్తే ఏ రాజకీయ పార్టీలో లేరు. ఆయన రాజకీయాలు ఎపుడో వదిలేశారు. తన శేష జీవితాన్ని సినిమాలకే అంకితం చేశారు. సినీకార్మికుల కోసం ఏదో చేయాలని తపన పడుతున్నారు. మరి దాన్ని అర్థం చేసుకోకుండా ఇలా ట్రోల్ చేయడమేంటని మెగాస్టార్ ఫ్యాన్స్ కూడా గుస్సా అవుతున్నారు. నిజానికి చిరంజీవి ఇండస్ట్రీకి ఒక్కడుగా వచ్చాడు. ఇపుడు ఆయనే ఇండస్ట్రీ అయ్యాడు. ఆయన ఘనమైన వారసత్వాన్నే పవన్ అందిపుచ్చుకున్నారు. చిరంజీవి లేకపోతే పవన్ హీరో అయ్యేవారా అన్న మాట కూడా వస్తోంది.

మరో వైపు చూస్తే చిరంజీవి సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికపుడు చర్చలు జరుపుతున్నారు. ఆయన పనిని ఆయన్ని చేయనివ్వరా అన్నది మెగా ఫ్యాన్స్ మాట. మొత్తానికి ఇద్దరు అన్నదమ్ముల దారులు ఎపుడూ వేరుగానే ఉంటూ వస్తున్నాయి. చిరంజీవి ఎవరినీ ద్వేషించరు, పరుష పదజాలమే వాడరు. బహుశా ఈ కారణాల వల్లనే ఆయన రాజకీయంగా రాణించలేకపోయారా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా పవన్ రాజకీయానికి చిరంజీవి అడ్డు కాదని ఎవరి పని వారిదేనని కూడా మెగా ఫ్యాన్స్ అంటున్నారు. అయితే పవన్ ఫ్యాన్స్ మాత్రం మొత్తం మెగా ఫ్యామిలీ అంతా జగన్ ని వ్యతిరేకించాలని అంటున్నారు. అది జరిగే పనేనా. ఎవరి ఆలోచనలు వారివి అన్నది సినీ పెద్దల మాట కూడా ఉంది. మొత్తానికి జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మాత్రం మెగా స్టార్, పవన్ స్టార్ల మధ్య కొత్త చిచ్చు ఇలా మొదలైందా అన్న మాట అయితే వినవస్తోంది.

# భరత్ రామ్ కు కార్పొరేషన్ సవాల్


రాజమండ్రి, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)జగన్ తుఫాన్ లో కూడా రాజమండ్రి అర్బన్ రూరల్ నియోజకవర్గాల్లో టిడిపి హవా కి ఢోకా లేకుండా పోయింది. మొదటి నుంచి టిడిపి కంచుకోటల్లో చారిత్రిక రాజమహేంద్రి కూడా ఆ పార్టీకి ఒకటి. ఇక్కడ కార్పొరేషన్ ఏర్పాటు అయ్యాక జరిగిన మూడు ఎన్నికల్లోనూ మేయర్ స్థానాలు గెలిచి హ్యాట్రిక్ నెలకొల్పిన చరిత్ర పసుపు దళానిది. ప్రస్తుతం కోర్టు వివాదంలో ఉన్న నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ ఎన్నికలకు రాజమహేంద్రి నోచుకోలేదు. అయితే మరికొద్ది నెలల్లో కోర్టు వివాదం పరిష్కారం అయ్యి ఎన్నికలకు రెడీ అవుతుందనుకుంటున్న సమయంలో టిడిపి కోట కి బీటలు మొదలు అయ్యాయి. పంచాయితీ, మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో జగన్ ప్రభంజనం రాజమహేంద్రి టిడిపి పై బాగా ప్రభావితం చేసినట్లే కనపడుతుంది. స్థానిక ఎన్నికలకు ముందు ఒకరిద్దరు మాజీ కార్పొరేటర్ ల స్థాయి పార్టీకి దూరం జరిగినా పెద్దగా నష్టం లేదని ఆ పార్టీ అంచనా వేసుకుంది. ఏపీ లో ప్రాంతాలకు అతీతంగా వచ్చిన జగన్ సునామీ చూశాక రాజమండ్రి పార్టీలో అధికారపార్టీవైపు నేతలు చూడటం మొదలు పెట్టారు. మాజీ కార్పొరేటర్ లు గా ఉన్న సీనియర్ నాయకులు పాలిక శ్రీనివాస్, బెజవాడ రాజ్ కుమార్ మరికొందరితో కలిసి ఇటీవల గోడ దూకేయటం టిడిపి క్యాడర్ లో నైరాశ్యాన్ని నింపింది. రాబోయే ఎన్నికల ముందు ఇవన్నీ దుశ్శకునాలేనా అన్న అనుమానాలు పసుపు దళంలో బాగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం రాజమండ్రి లో వైసిపి అన్ని డివిజన్ లలో టిడిపి తో పోలిస్తే బలంగా లేదు. ఎంపి భరత్ రామ్ చురుగ్గా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతున్నా కొత్త కో ఆర్డినేటర్ లు డా. ఆకుల సత్యనారాయణ, చందన నాగేశ్వర్ లు ఇంకా పట్టు సాధించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే టిడిపి కి నాలుగోసారి మేయర్ ఖాయం అయ్యే పరిస్థితి ఉందన్నది విశ్లేషకుల అంచనా. అయితే టిడిపి లో ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వర్గాల నడుమ ఇంకా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతవరణమే ఉంది. గోరంట్లకు బలమైన క్యాడర్ ఉన్నా ఆ వర్గానికి ఆదిరెడ్డి వర్గం పక్కన పెట్టేసి కార్యక్రమాలు సాగిస్తుంది. ఈ నేపథ్యంలో బుచ్చయ్య వర్గం గా ఉన్న వారు కొందరు పార్టీకి గుడ్ బై కొట్టేశారు. మరికొందరు అదే బాటలో ఉన్నారు. రాజమండ్రి లో తన పట్టును టిడిపి లో చాటి చెప్పాలంటే వచ్చే కార్పొరేషన్ ఎన్నికలే ఆదిరెడ్డి అప్పారావు కుటుంబానికి గీటురాయి కానున్నాయి. గోరంట్ల కార్పొరేషన్ ఎన్నికలకు దూరం జరిగితే వైసిపి నెత్తిన పాలు పోసినట్లే రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రధాన కార్యక్రమాలకు రాజమండ్రి అర్బన్ పార్టీ గోరంట్లను ఆమడ దూరం లో పెట్టేసింది. ఇకపై పార్టీ అధినేత వంటివారు కలగజేసుకుంటే తప్ప వీరిరువురు కలుస్తారన్న గ్యారంటీ లేదు. మరోపక్క ఎంపి భరత్ రామ్ ఆయన కోరి తెచ్చుకున్న టీం కి రాబోయే కార్పొరేషన్ ఎన్నికలే వారి ప్రతిభకు కొలమానం కానున్నాయి. ఇప్పటికే జగన్ భరత్ అండ్ టీం కి ఏమి కావాలన్న చేస్తా అన్నారని రాజమండ్రి కార్పొరేషన్ పై వైసిపి జండా ఎగరేయాలిసిందే అన్నారని లేకపోతే అందరిని పక్కన పెట్టేస్తా అని హెచ్చరిక జారీ చేసినట్లు చర్చ నడుస్తుంది. భరత్ టీం సక్సెస్ గా ముందుకు వెళ్లాలంటే జక్కంపూడి రాజా వర్గాన్ని కలుపుకుని వెళ్ళాలి. అయితే ఆ దిశగా ఎలాంటి అడుగులు పెద్దగా పడినట్లు కనిపించడం లేదు. రెండు ప్రధాన పార్టీల్లోనూ వేరు కుంపట్లు ఆయా శిబిరాల్లో గుబులు పుట్టిస్తున్నాయి. మరి ఏమి జరగనుందో వచ్చే కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కానీ చెప్పలేవు.

# జగన్ దెబ్బతీసేందుకు ప్రణాళికలు

నెల్లూరు, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)చంద్రబాబు కరోనా కూడా విలయతాండవం చేస్తోంది. నిజానికి గత ఏడాది కూడా కరోన ఫస్ట్ వేవ్ ఉన్న వేళ బాబు బర్త్ డే జరిగింది. అయితే నాడు లోకల్ బాడీ ఎన్నికలు పెండింగులో ఉన్నాయి. వాటిలో గెలిచి సత్తా చాటవచ్చు అని చంద్రబాబు నాడు భావించారు. దాంతో అంతా ఆశావహంగా వాతావరణం ఉంది. గుర్రున ఏడాది తిరగకుండానే ఇంతలో అంతా జరిగిపోయినట్లు అయింది. చంద్రబాబు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితాన్ని పూర్తిగా పరికించిన వారు అనే మాట ఒక్కటే. ఆయన తెలివైన రాజకీయ నాయకుడు అని. దానికి మించి అదృష్టవంతుడు అని. అది నిజమే అనిపిస్తుంది. నాడు అంజయ్య మంత్రి వర్గంలో ఏకంగా 78 మంది దాకా మంత్రులు అయ్యారు. అపుడు మంత్రి పదవుల భర్తీకి సీలింగ్ అంటూ ఏమీ లేదు. ఎంతమందిని అయినా చేసేయవచ్చు. అలా శాఖలు కూడా లేని వారు, సచివాలయంలో కుర్చీలు కూడా లేని వారు చాలా మంది మంత్రులు గా చలామణీ అయ్యారు. వారిలో చంద్రబాబు ఒకరు. అయితే ఆయనకు మంచి శాఖే దొరికింది. అదే సినిమాటోగ్రఫీ శాఖ. ఆయన అదృష్టం రింగ్ తొడుక్కుని పుట్టాడు కాబట్టే అలా మంత్రి అయ్యారు అని చెబుతారు. సీనియర్లకు సినిమాటోగ్రఫీ శాఖ ఇస్తే అవమానంగా భావిసారు. కానీ చంద్రబాబు లాంటి రాజకీయ తెలివిడి కలిగిన వారికి ఆ శాఖ ఇస్తే దాన్ని బ్రహ్మాండంగా ఉపయోగించుకున్నాడు. నాటి అగ్ర నటుడు ఎన్టీయార్ తో డైరెక్ట్ గా రిలేషన్స్ పెట్టుకుని ఏకంగా ఆయన ఇంటికే అల్లుడు అయిన మేధావి చంద్రబాబు. ఆ విధంగా చూస్తే బాబుని అదృష్ట జాతకుడు అని అనకుండా ఎవరైనా ఉండగలరా. ఇక కాంగ్రెస్ పని అయిపోయింది అన్న వేళ సొంత మామ ఎన్టీయారే అధికారంలోకి వచ్చాడు. దాంతో అల్లుడు హోదాలో చంద్రబాబు సునాయాసంగా కొత్త పార్టీలో ప్రవేశించి టీడీపీ మీద మొత్తం పేటెంట్ హక్కులు లాగేసుకున్నారు. ఇక చంద్రబాబు ను స్వయం ప్రకాశం లేదని ప్రత్యర్థులు అంటారు అది లేకపోతేనేమి ఎదుటి వారి వెలుగులను తన వైపు మళ్ళించుకుని అధికారాన్ని అందుకోవడంలో ఆయన దిట్ట.

అందుకే నాడు కాదన్న వాజ్ పేయితోనే చేతులు కలిపి ఎన్డీయే కన్వీనర్ గా ఒక వెలుగు వెలిగారు వాజ్ పేయ్ సానుభూతితో ఏపీలో రెండవమారు అధికారంలో అధికారంలో వచ్చారు. ఇక ఏపీకి వస్తే అరెస్ట్ చేయిస్తాను అని తాను కట్టడి చేసిన మోడీతోనే జోడీ కట్టి 2014లో విడిపోయిన ఏపీకి ఫస్ట్ సీఎం అయ్యారు. ఇపుడు కూడా తలుపులు మూసుకుపోలేదు అన్నదే చంద్రబాబు విశ్వాసం. రాజకీయాల్లో మడి కట్టుకోవడాలు ఎంతటి వారికైనా కుదిరేది కాదు, అందువల్ల 2024లో బీజేపీ పవన్ తన దగ్గరకు వచ్చేలా పావులు జాగ్రత్తగా కదుపుతున్నారు. ఇక వైసీపీ జగన్ బలాన్ని కూడా తగ్గించేలా పథకాలూ వేస్తున్నారు. అయితే చంద్రబాబు బుర్ర నిండా ఎన్ని తెలివితేటలు ఉన్నా కూడా రాజకీయంగా ఆయన్ని ఇంతటి స్థాయికి తెచ్చిన అదృష్టం మరోసారి కలసి వస్తేనే ఆయన నాలుగవ సారి ముఖ్యమంత్రి అయ్యేది. మరి బాబుకు ఈసారి కూడా లక్ కలిస్తే అదృష్ట జాతకుడు అన్న టైటిల్ ఆయనకే శాశ్వతంగా రాసిచ్చేయవచ్చు.

# అధ్యక్ష పదవికి రాహుల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)ఐదు రాష్ట్రాల ఎన్నికలపై రాహుల్ గాంధీ ఆశలు పెరిగాయి. పశ్చిమ బెంగాల్ మినహా మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు అధికారంలోకి వచ్చే అవకాశముందని ఆయన భావిస్తున్నారు. మోదీ ప్రభుత్వంపై పెరిగిన వ్యతిరేక దేశవ్యాప్తంగా కన్పిస్తుందని రాహుల్ గాంధీ అంచనాకు వచ్చారు. దీంతో పార్టీని కూడా పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడానికి రాహుల్ గాంధీ రెడీ అయినట్లు కన్పిస్తుంది. రాష్ట్రాల వారీగా కొత్త నేతలకు బాధ్యతలను అప్పగించాలని ఆయన డిసైడ్ అయ్యారంటున్నారు. దేశ వ్యాప్తంగా కూడా కాంగ్రెస్ కు కొంత సానుకూల పవనాలు వీస్తున్నాయి. మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేకపోయినా, ప్రచార ఆర్భాటం ఎక్కువగా ఉందని ప్రజలు గుర్తించారు. ఈ ప్రభావం ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కన్పిస్తుందని అంచనా వేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ లోనూ సయితం కాంగ్రెస్ కూటమి అనూహ్య రీతిలో ఎక్కువ స్థానాలను దక్కించుకుంటుందని రాహుల్ గాంధీ అంచనాకు వచ్చారు. కేరళలోనూ ఎన్నికల ముందు వరకూ ఎల్డీఎఫ్ కు కొంత అనుకూల పరిస్థితులు కన్పించినా ఎన్నికల సమయానికి యూడీఎఫ్ వైపు ప్రజలు మొగ్గు చూపారని తన సన్నిహితుల వద్ద రాహుల్ గాంధీ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తమిళనాడులో ఎటూ డీఎంకే విజయం తథ్యమని భావిస్తున్నారు. అసోంలోనూ కాంగ్రెస్ కు సానుకూల వాతావరణం ఉందన్న లెక్కలు రాహుల్ గాంధీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత రాహుల్ గాంధీ ఏఐసీసీ అధ్యక్ష పదవిని చేపట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. నేతలనుంచి వత్తిడి ఎక్కువగా ఉండటం, మరికొద్దిరోజుల్లోనే పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికలు ఉండటంతో అధ్యక్ష పదవిని చేపట్టాలని రాహుల్ గాంధీ డిసైడ్ అయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత పూర్తిగా ఉత్తర్ ప్రదేశ్ పై రాహుల్ గాంధీ దృష్టి పెట్టనున్నారు. మొత్తం మీద మోదీపై వ్యతిరేకత ప్రజల్లో స్పష్టంగా కనపడుతుండటంతో రాహుల్ గాంధీ 2024 ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమయిపోతున్నారు.

# ఆదానీ చేతిలోకి ఏపీ పోర్టులు

ఒంగోలు, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ గుప్పిట్లోకి వెళ్లబోతుంది. ఆయనకు ఆంధ్రప్రదేశ్ అన్ని రకాలుగా అనుకూలంగా, ఆదాయ వనరుగా ఉండటంతో ఇక్కడ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు అదానీ రెడీ అయిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న తీర ప్రాంతాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అదానీ సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కూడా ఉండటంతో ఇక అదానీ పంట పండినట్లేనంటున్నారు. అదానీ గ్రూపు పోర్టులపై ఆధిపత్యం కోసం ఆంధ్రప్రదేశ్ లో ప్రయత్నిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే గంగవరం పోర్టును అదానీ తమ హస్తగతం చేసుకున్నారు. ప్రభుత్వ వాటా మినహా మిగిలిన వాటాను దక్కించుకున్నారు. ఇక తాజాగా కృష్ణ పట్నం పోర్టు కూడా వందశాతం అదానీ సొంతమయింది. గత ఏడాది కృష్ణపట్నం పోర్టులో 75 శాతం వాటాను కొనుగోలు చేసిన అదానీ గ్రూపు కొద్ది రోజుల క్రితం మిగిలిన 25 శాతం వాటాలను కొనుగోలు చేసి పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకుంది. ఈ 25 శాతం వాటా 2,800 కోట్లట. రాష్ట్ర ప్రభుత్వం కూడా పోర్టులకు ప్రత్యేక ప్రయారిటీ ఇస్తుంది. రామాయపట్నం, బందరు, భావనపాడు పోర్టులను నిర్మించాలని భావిస్తుంది. ఎన్నికలలోపే వేగవంతం చేయాలని ఏపీ ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు పోర్టులను కూడా అదానీ గ్రూపు సొంతం చేసుకుంటుందన్న ప్రచారం ఊపందుకుంది. అదానీని తట్టుకునే శక్తి, సత్తా మరెవ్వరికీ లేవంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అదానీ గ్రూపు ఎంటర్ కావడం శుభపరిణామమని భావిస్తున్నాయి. అదానీ సంస్థ నిర్మాణ ప్రక్రియ చేపడితే వెంటనే నిర్మాణ పనులు పూర్తవుతాయని, స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఇది తమకు వచ్చే ఎన్నికల్లో సానుకూల అంశంగా మారుతుందని జగన్ విశ్వసిస్తున్నారు. ఇటు ఏపీ ప్రభుత్వం కూడా అదానీ గ్రూపు పట్ల సుముఖంగా ఉండటంతో ఇక అదానీ పంట ఏపీలో పండినట్లేనంటున్నారు.

# మంత్రులపై ఆరా

విజయవాడ, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)రాష్ట్ర కేబినెట్లో మొత్తం సీఎం జగన్‌తో కలిపి 25 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో సగం మంది వరకు ఇప్పుడు కనిపించడం లేదు. ముఖ్యంగా పరిషత్ ఎన్నికల హడావుడిలో ఉన్నారని.. అనుకున్నా.. ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత.. కూడా వారు ఎక్కడా కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో అసలు మంత్రులు ఏం చేస్తున్నారనే విషయం అధికార పార్టీ వైసీపీలోనే చర్చకు దారితీసింది. పరిషత్ ఎన్నికలను టీడీపీ బహిష్కరించడంతో ఎమ్మెల్యేలు కూడా ఈ ఎన్నికలను పట్టించుకోవడం లేదు.. ఇక మంత్రులు మరీ లైట్ తీస్కొన్నారు. కొందరు మంత్రులకు తిరుపతి ఉప ఎన్నిక బాధ్యతలు అప్పగించినా అక్కడ కూడా వారు ఒకటి రెండు రోజులు మాత్రమే ఉండి ఎటో చెక్కేస్తున్నారు. ఇదే విషయంపై సీఎం జగన్ కూడా ఆరాతీశారని సమాచారం. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఒక మంత్రి..మాత్రం పుదుచ్చేరి ఎన్నికల్లో ప్రచారం చేయడానికి అక్కడికి వెళ్లారు. అక్కడ ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఆయన రాలేదు. ఆయన అక్కడ నుంచి గోవా వెళ్లారని.. అక్కడ రెస్ట్ తీసుకుంటున్నారని సమాచారం. మరో మంత్రి.. కూడా హైదరాబాద్ వెళ్లారని తెలిసింది. ఇక, విజయనగరం జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణ నిత్యం మీడియాలో ఉంటూ.. టీడీపీపై హాట్ కామెంట్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే.. ఈయన ఇప్పుడు పరిషత్ ఎన్నికల హడావుడిలో జిల్లాలో నే తిష్టవేశారు. పరిషత్ ఎన్నికలు వన్‌సైడ్ అయిపోయినా బొత్స మాత్రం జిల్లాలోనే ఉండడం విశేషం. మరికొందరు మంత్రులు మాత్రం బెంగళూరు వెళ్లారని.. స్థానిక ఎన్నికల్లో విజయం తర్వాత.. ఒకింత రెస్ట్ కోరుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. 10 మందికి పైగా మంత్రులకు తిరుపతి ఉప ఎన్నికల ప్రచార బాధ్యతలు అప్పగిస్తే అక్కడ అందులో సంగం మంది కూడా పని చేయడం లేదు. కేవలం నలుగురు మంత్రులు మాత్రం తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. అయితే.. వీరిలోనూ ఇద్దరు ముగ్గరు ఎండ వేడికి తాళలేక.. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కూడా రెస్ట్ తీసుకున్నారని తెలుస్తోంది. మొత్తానికి ఈ పరిణామాలు గమనించిన తర్వాత.. వైసీపీ మంత్రుల్లో ఒక విధమైన ధైర్యం వచ్చిందని.. పార్టీ ఇప్పటికి చాలానే సాధించిందని.. ఇక, చేయాల్సింది ఏమీ లేదని వారు అనుకుంటున్నారని.. కొన్ని వ్యాఖ్యలు సీనియర్ల నుంచి వినిపిస్తుండడం గమనార్హం. ఈ పరిణామాలు అటు ఇటు తిరిగి.. సీఎం జగన్ చెవిలో పడడంతో ఆయన ఇప్పుడు ఈ మంత్రులు ఏం చేస్తున్నారో.. చెప్పాలంటూ.. ఓ సలహా దారుని కోరినట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

## మంత్రి పదవి కోసం ఎదురు చూపులు

కర్నూలు, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)ఇప్పుడున్న పరిస్థితిలో వైసీపీ నాయకులు ఎవరైనా పార్టీ అధినేత, సీఎం జగన్‌పై అలిగే పరిస్థితి ఉందా ? ఆయనపై కోపం తెచ్చుకునే అవకాశం ఉందా? అంటే లేనే లేదని సమాధానం వస్తుంది. నిజానికి ఇప్పుడే కాదు.. గతంలో 2019 ఎన్నికల తర్వాత.. అనేక మంది.. ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేశారు. ఈ క్రమంలో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అయితే.. అతి తక్కువ మంది (ఎక్స్ పెక్ట్ చేసిన)కి మాత్రమే పదవులు దక్కాయి. దీంతో చాలా మంది అలిగినా.. ఎక్కువగా నిలబడలేదు. వెంటనే జగన్ దారిలోకి వచ్చేశారు. దీరికి ఉదాహరణ ఎమ్మెల్యే రోజానే. అయితే.. ఇప్పుడు మాత్రం కర్నూలు జిల్లా నంద్యాల ఎమ్మెల్యే.. శిల్పా రవిచంద్రారెడ్డి మాత్రం.. జగన్‌పై పీకల వరకూ ఆగ్రహంతో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఒక్కరే కాదు.. ఆయన బాబాయి.. శ్రీశైలం ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి కూడా జగన్‌పై ఒకింత కోపంతోనే ఉన్నారు. వర్గ పోరును పెంచుతున్నారని.. తమలో తమకే విభేదాలు పెడుతున్నారని.. ఆయన ఇటీవల అన్యాపదేశంగా.. జగన్‌పై విమర్శలు రువ్వారు. అయితే.. దీనికి కారణం ఏంటి? ఎందుకు అనే విషయాలు ఆసక్తిగా మారాయి. ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో బాబాయి, అబ్బాయి ఇద్దరూ బాగానే కష్టపడ్డారు. ఇద్దరూ కూడా నంద్యాలలో వైసీపీ గెలుపుకోసం ఎన్నో ప్రయత్నాలు చేసి వార్ వన్‌సైడ్ చేసేశారు. ఇక్కడ పార్టీ గెలిచిన తర్వాత మాత్రం రవిచంద్ర తన సతీమణి నాగిణి రెడ్డిని చైర్ పర్సన్ చేసుకునేందుకు ప్రయత్నించారు. అంతేకాదు.. దీనికి సంబంధించి ప్రభుత్వ సలహాదారుగా ఉన్న ఒక కీలక నేత నుంచి కూడా హామీ పొందారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో 42 వార్డులుంటే 12 ఏకగ్రీవం అయ్యాయి. పోటీ జరిగిన 30 వార్డుల్లో 25 అధికార పార్టీ ఖాతాలోనే పడ్డాయి. మొత్తంగా 37 చోట్ల వైసీపీ పాగా వేసింది. మున్సిపాలిటీపై వైసీపీ జెండా ఎగరడంలో ఎమ్మెల్యే రవిచంద్రదే కీలక పాత్ర అని అందరూ అంగీకరిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు ముగియగానే.. చైరపర్సన్ తన సతీమణేనని రవిచంద్ర కూడా ప్రచారం చేసుకున్నారు. కానీ.. అధిష్టానం మాత్రం ప్లేట్ ఫిరాయించేసింది. పార్టీలో మరో సీనియర్ నేత రాజగోపాల్‌రెడ్డి పావులు కదపడంతో జగన్ ఇక్కడ ఒక్కసారిగా సీన్ మార్చేశారు. గోపాల్ రెడ్డి తన సతీమణి లలితను ఛైర్‌పర్సన్‌ను చేయాలని అనుకున్న ఆయనకు అవకాశం ఇవ్వకుండా.. ఏకంగా ముస్లిం అభ్యర్థిని తీసుకువచ్చి.. చైర్ పర్సన్ గా ప్రకటించారు. ఈ పరిణామంతో రవిచంద్ర జగన్ పట్ల పైకి చెప్పుకోలేకపోయినా తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాడట.

# త్వరలో 14 ఎమ్మెల్సీలు ఖాళీ

గుంటూరు, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ తాను అనుకున్నదే చేస్తారు. పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని జగన్ పదవులను భర్తీ చేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకూ భర్తీ చేసిన పదవులు పార్టీ కోసం కష్టపడ్డవారికి కాకుండా, సామాజికవర్గాల సమీకరణ చూసే జగన్ చేశారన్న విమర్శలు పార్టీ నుంచి విన్పిస్తున్నాయి. వైసీపీ నేతలు ఎందరో ఆశలు పెట్టుకున్నా జగన్ మాత్రం పార్టీ పునాదులు మరింత పటిష్టం చేసేందుకు ఎంపిక చేసిన వారికి ఇస్తున్నారు.అయితే జగన్ ఇప్పటి వరకూ ఎంపిక చేసిన వారు పార్టీకి ఎందుకూ ఉపయోగపడటం లేదన్న విమర్శలు విన్పిస్తున్నాయి. జగన్ అధికారంలోకి రావాలని ఎంతోమంది నేతలు ఎదురు చూశారు. దాదాపు పదేళ్ల పాటు శ్రమించారు. తమ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు వారు ఆర్థికంగా కూడా నష్టపోయారు. కానీ ఎమ్మెల్సీల ఎంపికలో జగన్ కేవలం సామాజికవర్గాలనే చూడటం సరికాదన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.ఎందుకంటే ఇప్పుడు జగన్ ఎంపిక చేసిన నేతలను వారి సామాజికవర్గాలను ప్రభావితం చేసే వారు కాదు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు పదిమంది ఎమ్మెల్సీలను ఎంపిక చేశారు. వీరిలో టీడీపీ నుంచి వచ్చిన పండుల రవీంద్రబాబు, డొక్కా మాణిక్యవరప్రసాద్, పోతుల సునీతతోపాటు మరికొందరు మైనారిటీ నేతలు కూడా ఉన్నారు. కానీ వీరివల్ల పార్టీకి ఉపయోగం లేదన్నది సీనియర్ నేతల అభిప్రాయం.త్వరలోనే మరో 14 ఎమ్మెల్సీలు ఖాళీ కాబోతున్నాయి. ఇందులో ఎమ్మెల్యే కోటాతో పాటు స్థానిక సంస్థల కోటా కూడా ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎటూ వైసీపీకి బలం ఉంది కాబట్టి మొత్తం ఎమ్మెల్సీ స్థానాలు వైసీపీకి దక్కే అవకాశముంది. ఈసారి జగన్ ఎవరికి అవకాశమిస్తారా? అన్న చర్చ పార్టీలో ఇప్పటి నుంచే ప్రారంభమయింది. మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, దాడి వీరభద్రరావు, ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి లాంటి వాళు ఆశలు పెట్టుకున్నారు. ఈసారైన జగన్ కష్టపడిన వారికి అవకాశమిస్తారా? సామాజికవర్గాలను చూస్తారా? అన్నది చర్చనీయాంశమైంది.

# వాస్తవాలు వక్రీకరించడం గిరిజన మంత్రి కి తగదు

## జనసేన

విజయనగరం విజయనగరం జిల్లా సాలూరు మండలం సాలూరు పట్టణము లో సాలూరు నియె?జక వర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ రేగి మహేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో రేగి మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉంటు గిరిజనాభివృద్ధి మరచి తన స్థాయిని పదలపర్చుకోవడానికి వాస్తవాలు వక్రీకరించడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. హైకోర్టులో కేసులు నడుస్తున్న సమయంలో అమాయక గిరిజనులు ను మభ్యపెట్టె విదంగా పత్రిక ప్రకటన ఇవ్వడం సరిగా లేదని అన్నారు. కులం అనేది ప్రతి వ్యక్తి తాత తండ్రుల నుండి వస్తుందని మీ సర్టిఫికేట్ ల నిజాఎ?తీ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# తరలుతున్న ఆక్సీజన్ వ్యాగన్లు

విశాఖపట్నం కరోనా సెకండ్ వేవ్ విజృంభిస్తున్న వేళ మన దేశంలో ఆక్సీజన్ కొరత ఏర్పడిం ది. కోవిడ్ పేషెంట్లకు సకాలంలో ఆక్సీ జన్ అందుక ఎంతో మంది మరణిస్తు న్నారు. ఈ క్రమంలోనే ఆక్సీజన్ సరఫరాపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఆక్సీజన్ ఉత్పత్తి కేంద్రాల నుంచి పరిశ్రమలకు సరఫరా నిలిపివేసి.. ఆస్పత్రులకు తరలిస్తోంది. వేగవంతంగా ఆక్సీజన్ తరలించేందుకు రైల్వేశాఖ ముందుకొచ్చి ఆక్సీజన్ ఎక్స్ప్రెస్సు నడుపుతోంది. గురువారం అర్ధరాత్రి విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రలకు తొలి ఆక్సీజన్ ఎక్స్ప్రెస్ రైలు బయలుదేరి వెళ్లింది. మొత్తం ట్యాంకర్లను మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

# గుంటూరులో మానవత్వం...

గుంటూరు, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)కరోనా వైరస్ మహమ్మారి యావత్ ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనా సోకిన వారి పట్ల కొందరు దారుణంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల ఎవరైనా కరోనాతో చనిపోతే వారి కుటుంబ సభ్యులు సైతం దూరం పెడుతున్న పరిస్థితి ఉంది. ఇలాంటి తరుణంలో కరోనాతో మరణిస్తున్న వారికి వారి ఆచార, సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు గుంటూరుకు చెందిన ముస్లిం యువకులు.గుంటూరు జిల్లా మండల కేంద్రమైన దుగ్గిరాలలో 48 ఏళ్ల హిందూ మహిళ కరోనాతో చనిపోయింది. అయితే, ఆమె కుటుంబ సభ్యులు భయంతో భౌతికకాయాన్ని ముట్టుకునేందుకు కూడా భయపడిపోయారు. ఇలాంటి సమయంలో సోషల్ మీడియా ద్వారా ద్వారా గుంటూరుకు చెందిన కోవిడ్ ఫైటర్స్ గురించి తెలుసుకుని గురువారం వారిని సంప్రదించారు.వెంటనే రంగంలోకి గుంటూరు కోవిడ్ ఫైటర్స్.. పఠాన్ అల్లాభక్షు, పఠాన్ ఫిరోజ్ఖాన్, హబీబ్ అన్సారీ, పఠాన్ ముజీబ్బాషా తమ సొంత అంబులెన్స్ వేసుకుని దుగ్గిరాల వెళ్లారు. సదరు మహిళ భౌతికకాయాన్ని తెనాలి శ్మశానవాటికకు తరలించి, హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, గతేడాది నుంచి ఇప్పటి వరకు కరోనాతో చనిపోయిన 223 మందికి అంత్యక్రియలు నిర్వహించామని కోడిడ్ ఫైటర్స్ తెలిపారు. కరోనాతో చనిపోయిన వారికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించే పరిస్థితి లేకపోతే.. తమను సంప్రదిస్తే ఆ కార్యం నెరవేరుస్తామని చెప్పారు. 8143222456, 9848940304 ఫోన్ నంబర్ల ద్వారా తమను సంప్రదిస్తే సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

### సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మి కంగా ప్రవేశ పెట్టిన వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రకాశం జిల్లా దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ముండ్లమూరు మండలం ముండ్లమూరు లో శుక్రవారం ప్రారంభం చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రం లో డ్వాక్రా మహిళలకు గొప్ప వరంగా ఉపయోగపడుతుంది అని ఎమ్మెల్యే వేణుగోపాల్ తెలిపారు. రాష్టంలో మహిళ అభివృద్ధి కి అనేక పథకాలు ప్రవేశ పెట్టారని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని గొప్పగా కొనియాడారు. తదుపరి డ్వాక్రా మహిళ సంఘనీ లీడర్స్ కు సున్నా వడ్డీ పథకం చెక్కులు ని స్వయంగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు తమ ఆనందం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి మరియు దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ఉప్పు సాగుపై కరోనా ప్రభావం



**ఆందోళనలో ఉప్పు సాగు రైతులు**
**ఉప్పును జాతీయ పంటగా గుర్తించాలి**
**స్థానికంగా గిడ్డంగుల ఏర్పాటు చేయాలి**
**మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి**
**ప్రభుత్వానికి ఉప్పు సాగు రైతుల విజ్ఞప్తి**

ఏలూరు ఏప్రిల్ 23 ఉప్పు సాగుపై గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కరోనా ప్రభావం పడింది. దీంతో ఉప్పు సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కరోనాతో ఎగుమతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సీజన్లో అదే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నరసాపురం ప్రాంతంలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉంది. తీర గ్రామాలైన పెదమైనవానిలంక, తూర్పుతాళ్లు, వేములదీవి, చినమైనవానిలంక, బియ్యపుతిప్ప, పేరుపాలెం గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో ఉప్పు సాగు ఉంది. దాదాపు 500 కుటుంబాలు ఉప్పు సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వీరిలో 90 శాతం మత్స్యకారులే కావడం గమనార్హం. ఉప్పు సాగు కష్టంతో కూడుకున్నది. ముఖ్యంగా మండే ఎండల్లో చేయాలి. చిన్న పాటి మడులను ఏర్పాటుచేసి ఉప్పు సాగు చేస్తారు. ఎకరానికి 60 నుంచి 70 వరకు మడులు కడతారు. ముందుగా మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి తర్వాత సముద్రంలోని ఉప్పు నీటిని ఆ మడుల్లో నింపుతారు. సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు 6 నుంచి 10 మంది శ్రమిస్తేనే గాని ఉప్పు తయారీ కాదు. ఎకరా ఉప్పు సాగుకు రైతుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. తయారైన ఉప్పును దళారులు ద్వారానే విక్రయించాల్సిన పరిస్థితి. నేరుగా దళారులు రైతుల వద్దకు వచ్చి బస్తాకు ఇంతని ధర నిర్ణయిస్తారు. ప్రస్తుతం దళారులు రైతుల వద్ద బస్తా (90 కిలోలు) రూ.220కు కొనుగోలు చేస్తున్నారు. బయట మార్కెట్లో బస్తా ధర రూ.1,000 వరకు పలుకుతుందని వాపోతున్నారు. మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు సౌకర్యాలు లేవు. దీంతో రైతులు ఉత్పత్తి అయిన వెంటనే ఉప్పును అయినకాడికి అమ్మేస్తుంటారు.ఉప్పును జాతీయ పంటగా గుర్తించాలనే డిమాండ్ చాలా కాలం నుంచి ఉన్నా అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. స్థానికంగా గిడ్డంగుల ఏర్పాటుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉప్పుసాగు గిట్టుబాటు కాకపోవడంతో ఈ ఏడాది చాలా మంది సాగు చేయలేదు. విస్తీర్ణం తగ్గినా సాగు బాగా సాగింది. అయితే అమ్మకాలు లేకుండా పోయాయి. కరోనా ఇబ్బందులు ఉండవని భావించి సాగులో ముందుకు వెళ్లాం. ఇప్పుడు పెట్టుబడులు రావడమే అనుమానంగా ఉంది. ఈ ఏడాది ఉప్పు బాగా పండుతోంది. అయితే మాకు ఆనందం నిలవలేదు. ఎప్పుడు పండిన పంటను అప్పుడే కొనుక్కుని వెళ్లిపోయేవారు. అయితే ఈ ఏడాది సగం కూడా అమ్ముడు కాలేదు. కరోనాతో ఎగుమతులు అంతగా లేవు. చాలా తక్కువగా బేరాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# ఏపీలో మహిళల అకౌంట్లలో డబ్బులు జమ

విజయవాడ, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)ఏపీలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.1,109 కోట్ల వడ్డీ రాయితీని ప్రభుత్వం అకౌంట్లలో జమ చేసింది. వరుసగా రెండో ఏడాది ఈ పథకం కింద నగదును తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. మొత్తం 9.35 లక్షల సంఘాల్లోని 1.02 కోట్ల మంది మహిళల ఖాతాల్లో జమ చేశారు. 2020-21 ఏడాదికి గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళలకు రూ.862.87 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని వారికి రూ.246.15 కోట్ల మేర వడ్డీ రాయితీని చెల్లించారు.మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలకు అండగా నిలబడ్డామన్నారు. మహిళా సాధికారితను ఆచరణలోకి తీసుకురాగలిగామని.. బ్యాంకుల ద్వారా నేరుగా సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని.. వారి ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత నినాదం కాదు.. తమ విధానం అన్నారు. గత ప్రభుత్వం రుణాల పేరుతో మహిళలను మోసం చేసిందన్నారు.దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా.. మహిళలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు ఇచ్చేలా చట్టం చేశామని జగన్ గుర్తు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని.. మహిళల రక్షణ కోసం ఎక్కడా రాజీ లేదన్నారు.రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. మహిళల కేసులు వాదించేందుకు ప్రత్యేక పీపీలను నియమించామన్నారు. మద్యం నియంత్రణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.బ్యాంకుల నుంచి రుణం తీసుకుని సకాలంలో కిస్తీలు చెల్లించిన డ్వాక్రా మహిళలకు ఆ రుణంపై వడ్డీ మొత్తాన్ని వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా ప్రభుత్వం చెల్లిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 9,34,852 పొదుపు సంఘాలకు సంబంధించి 1.02 కోట్ల మంది మహిళలు బ్యాంకుల నుంచి రూ.19,989 కోట్ల రుణాలు తీసుకుని నిబంధనల ప్రకారం కిస్తీలు చెల్లించారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ఆయా సంఘాలు సకాలంలో బ్యాంకులకు చెల్లించిన రుణాలపై రూ.1,109 కోట్ల మేర వడ్డీ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రతి ఊరిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించింది.

# వేధిస్తున్న కిట్ల కొరత

హైదరాబాద్, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)కవైపు కరోనా టెస్టులకు డిమాండ్ పెరుగుతున్నది. మరోవైపు దానికి తగినట్టుగా టెస్టుల కిట్లను సమకూర్చుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిపోతున్నది. సరిపడి నన్ని కిట్లను క్షేత్రస్థాయిలో పంపించకపోవడంతో పేద ప్రజలు టెస్టుల కోసం రోజుల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. దీంతో రాష్ట్రంలోని ప్రాథమిక కేంద్రా లు, ఏరియా ఆస్పత్రుల వరకు ప్రతిరోజూ పరిమిత సంఖ్య లోనే టెస్టులను చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పలువురు అనుమానితుల్లో సీరియస్ లక్షణాలు బయటపడుతున్నాయి. ఇదిలావుండగా పరీక్షలు చేసిన తర్వాత పాజిటివ్ వచ్చిన రోగుల మొబైల్ కు మెస్సేజ్ రూపంలో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇందుకోసం ఇచ్చిన యాప్ పని చేయకపోవడంతో విషయం చేరవేతలో జాప్యం చోటు చేసుకుంటున్నది. దీంతో టెస్టులు చేసుకున్న అనుమానితులు సైతం తమకు కరోనా ఉందో? లేదో? తెలియని అయోమయానికి గురవుతున్నారు.ఆక్సిజన్ ఎక్కించాల్సిన అవసరం లేకుండా రోగులను కాపాడుతుందని భావిస్తున్న రెమ్డెసివిర్ ఇంజెక్షన్ల కొరత కొనసాగుతూనే ఉంది. పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు డాక్టర్లు అదే పనిగా రెమ్ డెసివిర్ ను సిఫారసు చేస్తుండటంతో దాని డిమాండ్ అమాంతం పెరిగింది.కాగా ఆయా ఆస్పత్రుల వద్ద స్టాకు లేదనీ, రోగుల బంధువులే తెచ్చుకోవాలని చెబుతుండటంతో సరఫరాదారు హెటిరో అవుట్ లెట్ల వద్దకు పరుగులు తీసిన సంగతి తెలిసిందే. భారీగా జనం రావడంతో ఆన్ లైన్ లో బుకింగ్ కోసం ఇంజెక్షన్లు కావాల్సిన వారు రోగి పేరు, ఐపీ నంబర్, అటెండర్ పేరు, మొబైల్ నంబర్, ఆస్పత్రి పేరు, నగరం పేరు, ఇంజక్షన్ల సంఖ్య వివరాలను మొబైల్ నంబర్ 91338 96969కు వాట్సాప్ లో గానీ, మాన్యువల్ మెసేజ్గానీ పంపించాలని సూచిస్తూ తమ కార్యాలయం ముందు సూచనలు పెట్టారు. అయితే ఫోన్లో సంప్రదించినా స్టాకు లేదని సమాధానం వస్తుండటం గమనార్హం. ప్రయివేటు ఆస్పత్రులు, ల్యాబరేటరీలపై 91541 70960కు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సూచించింది. రోగులు ఇబ్బంది పడవద్దనీ, ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని వసతులు ఏర్పాట్లు చేశామనీ, వాటిని వినియోగించుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు సూచించారు.కరోనా రోగులు అత్యవసర పరిస్థితిలో సకాలంలో

చికిత్స పొందేందుకు వీలుగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న బెడ్ల తాజా వివరాలను పెడుతున్నది. అందులో ఖాళీలు చూపిస్తున్నప్పటికీ ప్రయివేటు ఆస్పత్రులు రోగులను బెడ్లు లేవని వెనక్కి పంపిస్తున్నాయి. పేద రోగులను వెనక్కి పంపించవద్దని, నిర్దేశించిన ఫీజుల కన్నా ఎక్కువ వసూలు చేయవద్దని చేస్తున్న హెచ్చరికలను పెడచెవిన పెడుతున్నాయి.హైదరాబాద్ లోని గాంధీ ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ కొరత ఉందని వస్తున్న వార్తలను ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు ఖండించారు. ఆస్పత్రిలో 20 కిలో లీటర్లు, ఆరు కిలో లీటర్ల ఆక్సిజన్ ట్యాంకులున్నాయని తెలి పారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి సీరియస్ రోగులు వస్తున్నారన్నారు. గాంధీలో చేరేందుకు ఆర్టీపీసీఆర్ రిపోర్టు తప్పని సరికాదని స్పష్టం చేశారు. రిపోర్టు లేని కారణంగా భద్రతా సిబ్బంది అంబులెన్సులను ఆపడం, వైద్యసిబ్బంది చికిత్స చేయని ఘటనల నేపథ్యంలో ఆయన సర్క్యులర్ జారీ చేశారు

# బెంగాల్ లో కరోనా వార్

కోల్ కత్తా, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చీమచిటుక్కుమన్నా రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగుతోంది. ఎనిమిది విడతలుగా జరుగుతున్న ఎన్నికల్లో ఇప్పటికే ఆరు విడతల పోలింగ్ పూర్తయింది. మరో రెండు విడతల పోలింగ్ మాత్రమే జరగాల్సి ఉంది. ఇప్పటికే బెంగాల్ ప్రజలు తమ వైపంటే తమ వైపు ఉన్నారని అధికార టీఎంసీ,బీజేపీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే చివరి వరకూ సర్వశక్తులూ ఒడ్డిన బీజేపీ.. కరోనా వ్యాక్సిన్పై చేసిన చిన్న ట్వీట్తో కష్టాల్లో పడింది. నెటిజన్లు ఓ రేంజ్లో విమర్శలు గుప్పిస్తున్నారు.కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ మాత్రమే మార్గమని చెబుతున్న ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా వ్యాక్సిన్ తయారీ కంపెనీలు సగం డోసులను కేంద్రానికి.. మిగిలిన డోసులను రాష్ట్రాలకు, ఓపెన్ మార్కెట్లో విక్రయించుకోవచ్చంటూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ నిర్ణయంపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రానికి, రాష్ట్రానికి ధరల తేడాపై దుమ్మెత్తిపోస్తున్నాయి. తాజాగా కరోనా వ్యాక్సిన్ ఉచితం అంటూ బీజేపీ చేసిన ట్వీట్ బెంగాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఓటేసి గెలిపిస్తే.. రాష్ట్ర ప్రజలందరికీ కరోనా వ్యాక్సిన్ ఫ్రీ అంటూ బీజేపీ చేసిన ఆ పార్టీ రాష్ట్ర విభాగం చేసిన ట్వీట్ దుమారం రేపుతోంది. ఓట్లేసి గెలిపిస్తే కోవిడ్ వ్యాక్సిన్ ఫ్రీ అంటూ ప్రకటించడంపై నెటిజన్లు ఓ రేంజ్లో ఫైర్ అవుతున్నారు. ఎన్నికలు ఉన్నాయి కాబట్టి ఓట్ల కోసం వ్యాక్సిన్ ఫ్రీగా వేస్తారా? లేకపోతే ప్రజలతో అవసరం లేదా ఘాటు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇక అధికార టీఎంసీ ఇదే అదనుగా తీవ్ర విమర్శలతో విరుచుకుపడుతోంది. బెంగాల్ను తమ ఖాతాలో వేసుకునేందుకు చివరి వరకూ హోరాహోరీ పోరాడిన బీజేపీ.. వ్యాక్సిన్ ట్వీట్తో అడ్డంగా బుక్కైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రభావం రానున్న రెండు దశల పోలింగ్పై ఏ మేరకు పడనుందో చూడాలి మరి!!

# వివాహిత ఆత్మహత్య

## కుమార్తె సజీవదహనం

నెల్లూరునెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం నెల్లూరు పాలెం సెంటర్ వద్ద దారుణం జరిగింది. నెల్లూరుకు చెందిన సుబ్బులు అనే మహిళ తన ఇద్దరు పిల్లల తో కలిసి తాను కూడా నిప్పు పెట్టుకొని ఆత్మహత్య ప్రయత్నం చేసింది. ఈ సంఘటనలో తల్లి సుబ్బులు (27) కుమార్తె మధురవాణి (5) మృతి చెందారు. నిప్పు చూసి తప్పించుకొని పారిపోయి వచ్చిన కుమారుడు మహేష్ ఇచ్చిన సమాచారంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు బళ్లారి నుండి వచ్చిన బస్సులో సెంటర్లో దిగినట్టు స్థానికులు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలే ఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

# ధూళిపాళ్ల నరేంద్ర ఆరెస్టు

గుంటూరు తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ను అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా చింతలపూడిలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం తెల్లవారుజామునే భారీగా మోహరించిన పోలీసుల సమక్షంలో నరేంద్రను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం నరేంద్రను అక్కడి నుంచి తమ వాహనంలో తీసుకెళ్లారు. ధూళిపాళ్ల ప్రస్తుతం సంగం డెయిరీ ఛైర్మన్గా కొనసాగుతున్నారు. ఆ సంస్థలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ఆయనపై 408, 409, 418, 420, 465 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కాగా, సీఆర్పీసీ సెక్షన్ 50(2) కింద నరేంద్ర సతీమణికి ఏసీబీ నోటీసులు జారీ చేసి, నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు నోటీస్ లో పేర్కొన్నారు ఏసీబీ అధికారులు.

# రాజీవ్ గృహకల్పనలో తల్లిబిడ్డల అనుమాన మృతి

విశాఖపట్నం మారికవలస రాజీవ్ గృహకల్పన కాలనీలో బ్లాక్ నెంబర్ 57లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన రవికుమార్ ,భార్య సరిత ఇద్దరు బాబులతో ఉంటున్నారు .వీరు ఆనందపురం జంక్షన్ లో హోటల్ నిర్వహిస్తు సంతోషంగా జీవించారు, కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావటంతో ఆర్థికంగా ఇబ్బందిపడ్డారు,సొంత హోటల్ మూసివేసి రవి వేరే హోటల్లో,సరిత ప్రైవేట్ పాఠశాలలో టీచర్ గా పనిచేసినా, గతంలో నష్టలను పూర్తి స్థాయిలో తీర్చలేకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బంధులను ఎదురుకుంటున్నారు,రవికుమార్ విధులకు వెళ్ళగా ,భార్య సరిత ,చిన్న కుమారుడు చేతన ఆత్మహత్య చేసుకున్నట్టు దొరికినలేకతోపాటు వచ్చిన సమాచారంతో పి.యం పాలేం పోలీసులు దిన్ని అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి, ఎసిపి కుమార్ స్వామి ,సి.ఐ దర్యాప్తుచేస్తున్నారు .

# బంగారం, వెండి ధరలు ఇలా




ముంబై, ఏప్రిల్ 23, (న్యూస్ పల్స్)కొంత కాలం ఆగి బంగారం కొనుగోలు చేయాలని భావించిన వారికి ఝలక్. ఎందుకంటారా? బంగారం ధర పెరుగుతూనే వస్తోంది. ఈరోజు కూడా ఇదే ట్రెండ్ నడిచింది. బంగారం ధర పైపైకి చేరింది. పసిడి ప్రేమికులకు ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పాలి. బంగారం ధర పైకి చేరితే వెండి రేటు మాత్రం అక్కడే నిలకడగానే ఉంది.హైదరాబాద్ మార్కెట్లో శుక్రవారం బంగారం ధర పైకి చేరింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.270 పెరుగుదలతో రూ.49,200కు ఎగసింది. అదేసమయంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా ఇదే దారిలో నడిచింది. రూ.250 పెరుగుదలతో రూ.45,100కు చేరింది. అదే ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.49,700 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర రూ.46,000 వద్ద ఉంది.బంగారం ధర పరుగులు పెడితే.. వెండి రేటు మాత్రం నిలకడగానే కొనసాగింది. వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. వెండి ధర కేజీకి రూ.73,900 వద్దనే స్థిరంగా ఉంది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ స్తబ్దుగా ఉండటం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.అంతర్జాతీయ మార్కెట్లో కూడా బంగారం ధర పెరిగింది. బంగారం ధర ఔన్స్కు 0.27 శాతం పెరుగుదలతో 1786 డాలర్లకు చేరింది. బంగారం ధర పైకి కదిలితే వెండి రేటు మాత్రం దిగొచ్చింది. ఔన్స్కు 0.05 శాతం తగ్గుదలతో 26.17 డాలర్లకు క్షీణించింది.ఇకపోతే బంగారం ధరపై ప్రభావం చూపే అంశాలు చాలానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వాటి వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు, బాండ్ ఈల్డ్ వంటి పలు అంశాలు పసిడి రేటుపై ప్రభావం చూపుతాయని గమనించాలి

# మూల్యం చెల్లిస్తారు

ఏలూరు టిడిపి నేత మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ను ఎసిబి అధికారులు నోటీసు లేకుండా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఖండించారు . వైసిపి ప్రభుత్వం సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అనుమానితులకు 41 నోటీసు ఇవ్వాలని ఉన్నాఉత్తర్వులను ఖాతరు చేయకుండా ధూళిపాళ్ల నరేంద్రను అర్ధరాత్రి అక్రమ అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధం అన్నారు .ప్రపంచం మొత్తం కరోనా చుట్టూ తిరుగుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మాత్రం కక్షలు,కేసులు,అక్రమ అరెస్ట్ లచుట్టూ తిరుగుతున్నారన్నారు . రైతులు భాగస్వామ్యం తో నడిచే సంగం డెయిరీ నీ అమూల్ కంపెనీ కి అప్పజెప్పడనికి అడ్డుగా ఉన్నందుకే ధూళిపాళ్ల నరేంద్ర ను అరెస్టు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులను టార్గెట్ చేసి ముఖ్యమంత్రిజగన్ అక్రమ అరెస్ట్ లు చేస్తున్నారు దీనికి త్వరలోనే జగన్ తగిన మూల్యం చెల్లిస్తారని మండిపడ్డారు

# సున్నా వడ్డీ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే సాయి

ఆదోని ( విభారె) రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం కింద పొదుపు సంఘాల రుణ ఖాతాల్లో వడ్డీ నగదు జమ చేసే జమ చేయడం జరిగింది ఇందులో భాగంగా ఆదోని శాసనసభ్యులు వై సాయి ప్రసాద్ రెడ్డి వై.యస్.ఆర్ సున్న వడ్డీ పథకం ద్వారా నియోజకవర్గానికి వచ్చిన చెక్కులను మహిళలకు పంపిణీ చేశారు .అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు పొదుపు సంఘాలలో అర్హులైన ఎస్ హెచ్ జి మహిళలకు ఆదోని అర్బన్ రూ.1,9328,445 చెక్కును, మరియు రూరల్ రూ. 2,4051,811/- చెక్కును ఎస్ హెచ్ జి ఖాతాలో జమ కావడం జరిగింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుందని ఆయన కొనియాడారు.అనంతరం ఆదోని రూరల్ మరియు

అర్బన్ వాలంటీర్లకు కు గౌరవ శాసనసభ్యులు వై సాయి ప్రసాద్ రెడ్డి వాలంటీర్లకు కు వజ్ర రత్న, సేవ రత్న,సేవా మిత్ర, అవార్డు లను అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ఆదోని మున్సిపల్ చైర్మన్ బి.శాంతా, మునిసిపల్ కమిషనర్ ఆర్జివి కృష్ణ,ఏ పి ఎం జనార్ధన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామైక్య సంఘం అధ్యక్షులుగా అట్ల గాయత్రి ఎన్నిక

తుగ్గలి( విభారె) మండల పరిధిలోని పెండెకల్లు గ్రామైక్య సంఘం అధ్యక్షులుగా అట్లాగాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శుక్రవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన పొదుపు మహిళలు వెలుగు సి.సి శేఖర్ అధ్యక్షతన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పొదుపు మహిళలు గ్రామైక్య సంఘం ను ఎన్నుకున్నారు.గ్రామైక్య సంఘం అధ్యక్షులుగా అట్ల గాయత్రి ను,ఉపాధ్యక్షులుగా ఎన్. రజినమ్మ ను,కార్యదర్శిగా నేసే విజయలక్ష్మి ను,సహాయ కార్యదర్శిగా యం.చంద్రకళ, కోశాధికారిగా యం.నాగలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సున్నా వడ్డీ చెక్కులు పంపిణీ : సీఎం జగన్మోహన్ రెడ్డి విడుదల చేసిన సున్నావడ్డి చెక్కులను సర్పంచ్ మాదిగ లీలావతి,గ్రామైక్యసంఘం అధ్యక్షులు అట్లాగాయత్రి పొదుపు మహిళలకు పంపిణీ చేశారు. గ్రామంలోని 39 పొదుపు సంఘాలకు దాదాపు లక్ష రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కారం రత్నమ్మ, వైకాపా నాయకులు అట్ల బసి రెడ్డి,వైకాపా మాజి యంపిటిసి దంపతులు నేసే విజయలక్ష్మి, గంగన్న,గ్రామైక్య సంఘం ఉపాధ్యక్షులు యన్. రజినమ్మ,సహాయకార్యదర్శి యం.చంద్రకళ, కోశాధికారి యం నాగలక్ష్మి,వెలుగు సిసి శేఖర్, విబికే రమణారెడ్డి,పలువురు పొదుపు మహిళలు,వైకాపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న రంగాపురం గ్రామ సచివాలయం -2

బేతంచెర్ల ( విభారె) మండల పరిధిలోని ఆర్. ఎస్.రంగాపురం గ్రామ సచివాలయం -2 శుక్రవారం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఘటన చోటుచేసుకుంది. ఇక్కడ పనిచేసే సచివాలయం ఉద్యోగులు దాదాపుగా రెండు రోజులుగా హాజరు రిజిస్ట్రార్ నందు ఎలాంటి హాజరు పొందుపరచకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. గ్రామ సచివాలయం నందు మొత్తం 9 మంది ఉద్యోగులు ఉండగా అందులో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసూతి సేవల నిమిత్తం ఉండగా,మిగిలిన 8 మంది ఉద్యోగుల హాజరులో కేవలం 4 గురు మాత్రమే కార్యాలయానికి హాజరు కాగా, మిగిలిన 4 గురు ఉద్యోగుల హాజరును అలాగే ఖాళీగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. ఆ ఉద్యోగులు కార్యాలయానికి హాజరు కాకపోగ, వారికి సంబంధిత అధికారి ఎలాంటి సిఎల్ కూడా పొందుపరచక పోగా అలానే ఉంచడం, ఇక పోతే కొంత మంది ఉద్యోగుల దాదాపుగా 3 రోజులు అయిన హాజరు పట్టి నందు సంతకాలు చేయపోవడం చూస్తుంటే వీరు ఇక ప్రజలకు ఎలాంటి న్యాయం చేస్తారని అనుమానం కలుగుతోందని గ్రామ ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం.ఇదే విషయమై ఈవోఆర్డీ మోహన్ కుమార్ ను చరవాణి లో సంప్రదించగా సంభాషణలు చూస్తుంటే,ఆ విధులకు హాజరు కాని ఆ నలుగురు ఉద్యోగులను కాపాడేందుకు అని రంగాపురం గ్రామ ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం.

# రోడ్డుకు ఇరుపక్కల వేస్టేజ్ మెటీరియల్ వేసినట్లయితే కఠిన చర్యలు

నంద్యాల ఏప్రిల్ 23( విభారె) బనగానపల్లె నుండి తాడిపత్రి కి వెళ్లే రోడ్డుకు ఇరుపక్కల వేస్టేజ్ మెటీరియల్ వేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల సబ్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి అన్నారు. శనివారం నంద్యాల సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రీమతి కల్పనా బనగానపల్లె నుండికుమారి మైనింగ్ డిపార్ట్మెంట్ ఏడి బనగానపల్లె అవుకు కొలిమిగుండ్ల తహసిల్దార్ లతో మరియు ఎంపీడీవో లతో బనగానపల్లె నుండి తాడిపత్రి కి వెళ్లే రోడ్డుకి ఇరుపక్కల వేసిన వేస్టేజ్ మెటీరియల్ ను క్లియర్ చేయించుట కొరకు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో నంద్యాల సబ్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి మాట్లాడుతూ

**సబ్ కలెక్టర్ కల్పనా కుమారి**

బనగానపల్లె నుండి తాడిపత్రి కి వెళ్లే రోడ్డుకి ఇరుపక్కల మైనింగ్ కు సంబంధించిన వేస్ట్ మెటీరియల్ ను కొలిమిగుండ్ల మండల కేంద్రం వరకూ రోడ్డుకి ఇరుపక్కల అంతరాయం కలిగించే విధంగా వేస్టేజ్ ని వేసి ఉన్నారని ఇలా వేయడం వల్ల వాహనాలకు ఇబ్బంది కలిగి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అందుకొరకే రోడ్డుకి ఇరుపక్కల ఉన్నటువంటి వేస్ట్ మెటీరియల్ ను మైనింగ్ శాఖ వారు మైనింగ్ కంపెనీలతో మాట్లాడి మైనింగ్ కంపెనీల వారు ఎవరు కూడా రోడ్డు ఇరుప్రక్కల వేస్టేజ్ వెయ్యకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

# ఫేషియల్ ట్రీట్మెంట్ ఫెయిల్ అయితే ఇలా మారిపోతామా!

## మీరు పొరపాటున కూడా ఈ తప్పులు చేయకండి...




ఈరోజుల్లో చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఎంతగానో ఆరాటపడుతున్నారు. ఇందుకోసం కొందరు సహజ చిట్కాలను పాటిస్తున్నారు. మరికొందరు చర్మ నిపుణుల సలహాలను పాటిస్తున్నారు. ఇంకొంతమంది అయితే ఏవేవో ట్రీట్ మెంట్లు తీసుకుంటున్నారు. అనవసరంగా అందవికారంగా మారిపోతున్నారు.తాజాగా తమిళ నటి రైజా విల్ సన్ కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. తన చర్మం మరింత మెరుస్తుందనుకుంటే.. ఉన్న మెరుపు కాస్త పోయి.. తన ఫేసు భయంకరంగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఓ ఫొటోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. స్కిన్ డాక్టర్ తనకు బలవంతంగా చికిత్స చేశారని, దీంతో తన ఫేస్ ఇలా తయారైందని.. తన బాధను వెల్లడించింది. ఫేషియల్ ట్రీట్మెంట్ తో అందం పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఏ చిన్న పొరపాటు జరిగినా మీ చర్మానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, అందుకు తానే నిదర్శనమని చెప్పింది. ఇంతకీ ఆమె ఏ పొరపాటు చేసింది.. ఆమెకు ఎందుకు జరిగింది.. అలా జరగకుండా ఉండాలంటే ఏయే జాగ్రత్తలు పాటి ంచాలనే వివరాలను ఇప్పుడు తెలుసు కుందాం. ఖరీదైన చర్మ చికిత్స.. ఖరీదైన చర్మ చికిత్స.. తమిళ నటి రైజా విల్సన్ తాజాగా తన ఇన్ స్టాగ్రామ్ లో ఓ ఫోటోన ం షేర్ చేసింది. అందులో తన ఫేస్ మీద ఒక నల్లని పెద్ద మచ్చ కనిపిస్తుంది. తన కళ్ల కింద కూడా ఎక్కువ వాపు కనిపిస్తోంది. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. దీనికి స్కిన్ డాక్టర్ ట్రీట్మెంట్ వల్లే ఇదంతా జరిగిందని వివరించింది. ఈ పోస్టు షేర్ చేసే ముందు తాను సాధారణ ఫేషియల్ ట్రీట్మెంట్ కోసం డాక్టర్ భైరవి వద్దకు వెళ్లానని, అయితే ఆమె తన స్కిన్ పాడైం దని.. బలవంతంగా తనకు స్కిన్ ట్రీటమెంట్ చేసిందని.. ఇలా జరిగిన తర్వాత డాక్టర్ తనను కలవడానికి నిరాకరించిందని చెప్పుకొచ్చింది. ఫేషియల్ ట్రీట్మెంట్ అంటే.. ఫేషియల్ ట్రీట్మెంట్ అంటే.. ఫేషియల్ ట్రీట్మెంట్ అంటే.. చర్మ సంరక్షణ కోసం కొన్ని రకాల క్రీములను, ఫేస్ మాస్క్ వంటి వాటిని ఉపయోగిస్తారు. టోనర్లను ఉపయోగిం చడం వల్ల చర్మంలో మరింత నిగారింపు కనిపిస్తుంది. ఫేషియల్ ట్రీట్మెంట్ ప్రతికూలతలు.. ఫేషియల్ ట్రీట్మెంట్ ప్రతికూ లతలు.. ఫేషియల్స్ ట్రీట్మెంట్ తీసుకునేటప్పుడు, ఎన్నో రకాల రసాయన ఉత్పత్తులను ఉపయోగిస్తారు. అలాంటి రసాయన ఉత్పత్తుల వల్ల ఫేస్ పాడైపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొందరి చర్మానికి కెమికల్స్ దుష్ప్రభావం వల్ల దురద పెరుగుతుంది. ఎర్రని గుర్తులు.. ఎర్రని గుర్తులు.. ఎవరైనా ఫేస్ పై తప్పుగా స్క్రబ్ చేయడం వల్ల ముఖం మీద ఎర్రని గుర్తులు ఏర్పడతాయి. దీని వల్ల చర్మం యొక్క అందం తగ్గిపోతుంది. అంతేకాదు చాలా వికారంగా కనిపిస్తుంది. చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. మొటిమలు.. మొటిమలు.. ఫేషియల్ ట్రీట్మెంట్ తీసుకున్న తర్వాత చర్మ రంధ్రాలు తెరచుకునే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల ముఖంపై మొటిమలు పెరిగిపోవచ్చు. అవి మెల్లగా బయటకు కనిపిస్తాయి. దీంతో మీ అందం మరింత చెడిపోవచ్చు. స్కిన్ అలర్జీ.. 4ల ఖం పైన జీతం? 1 అతీ టర్మ్ లైఫ్ కవర్ ఏ ?850/ నెల అర్హత చెక్ చేయండి. ం స్కిన్ అలర్జీ.. ఫేస్ పై ఫేషియల్స్ సమయంలో అనేక రకాల ఉత్పత్తులను ఉపయోగిస్తారు. ఇది స్కిన్ అలర్జీని కలిగించే ప్రమాదం ఉంటుంది. మీ ముఖం యొక్క చర్మంపై సహజంగా వచ్చే తేమ ఆరిపోతుంది. అదే సమయంలో, మీ ముఖంలో నిగారింపు తగ్గిపోతుంది.

# 16 కోట్ల ఆటగాడిపై ఒత్తిడి.. నేనైతే అంత ఇవ్వను!

ముంబై: ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌కు సంబంధించి ఫిబ్రవరిలో జరిగిన వేలంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్‌ను రూ. 16.25 కోట్లకు కొనుగోలు చేసింది రాజస్థాన్ రాయల్స్. మోరిస్‌పై భారీ అంచనాలు పెట్టుకున్న రాజస్థాన్.. అతనికి భారీ మొత్తం చెల్లించి తీసుకుంది. కానీ అతను రాజస్థాన్ అంచనాలను అందుకోవడంలో విఫలం అవుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకూ జరిగిన మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో తప్పితే పెద్దగా ఆకట్టుకున్న సందర్భాలు లేవు. ప్రధానంగా బౌలింగ్‌లో మోరిస్ బారీ పరుగుల్ని సమర్పించుకుంటున్నాడు. ఇప్పటివరకూ నాలుగు మ్యాచ్‌లు ఆడిన మోరిస్.. 14 ఓవర్లు బౌలింగ్ వేసి 139 పరుగులిచ్చాడు. ఇందులో అతను తీసుకున్న వికెట్లు ఐదు. ఆర్సీబీతో గురువారం జరిగిన మ్యాచ్‌లో మూడు ఓవర్లే వేసిన మోరిస్ 38 పరుగులు సమర్పించుకున్నాడు. దీనిపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ మాట్లాడుతూ.. మోరిస్ ప్రదర్శనను ఎత్తిచూపాడు. ' భారీ మొత్తం చెల్లించి మోరిస్‌ను రాజస్థా తీసుకుంది. మోరిస్‌పై అంత ధర పెట్టడం అంటే కాస్త ఆశ్చర్యమే అనిపించింది.

# 'ఐకాన్' ప్రాజెక్ట్ బన్నీతో కాదా..? మరో స్టార్ హీరోతోనా..?




స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఎప్పటినుంచో ఊరిస్తూ వస్తున్న "ఐకాన్" ప్రాజెక్ట్ ని పట్టాలెక్కించే పనిలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ తాము వెంటనే చేయబోయేది 'ఐకాన్' సినిమానే అని వెల్లడించారు. అల్లు అర్జున్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై రెండేళ్ల క్రితం ఈ చిత్రాన్ని ప్రకటించగా.. అనివార్య కారణాల వల్ల సెట్స్ పైకి రాలేదు. ఇప్పుడు వేణు శ్రీరామ్ 'వకీల్ సాబ్' తో హిట్ కొట్టడంతో ఐకాన్ ప్రాజెక్ట్ మళ్ళీ వార్తల్లోకి వచ్చింది. అయితే ఇప్పుడు 'ఐకాన్' సినిమాలో హీరో బన్నీ కాదని.. మరో స్టార్ హీరోతో చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.దిల్ రాజు 'ఐకాన్' సినిమా చేస్తామని ప్రకటించారు కానీ హీరో అల్లు అర్జున్ గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనికి తోడు ఈ సందర్భంగా 'ఐకాన్ స్టార్' ట్యాగ్ లైన్ గురించి నిర్మాత చేసిన వ్యాఖ్యలు కూడా బన్నీ ఈ ప్రాజెక్ట్ చేయడం లేదనే విషయాన్ని వెల్లడిస్తున్నాయని కామెంట్స్ వస్తున్నాయి. 'ఐకాన్ స్టార్ అని ఆయన పెట్టుకున్నాడు.. మనం పెట్టింది కాదు' అని దిల్ రాజు అనడంపై అల్లు అర్జున్ అభిమానులకు ఇబ్బంది కలిగించాయి. అదే సమయంలో 'ఐకాన్' సినిమా బన్నీ చేయడం లేదనే సంకేతాలు కూడా ఇస్తున్నాయని అంటున్నారు.ఈ నేపథ్యంలో కారణాలేవైనా అల్లు అర్జున్ 'ఐకాన్' చేయడం లేదని.. ఈ స్క్రిప్ట్ పై పూర్తి నమ్మకం పెట్టుకున్న దిల్ రాజు ఇప్పుడు వేరే హీరో కోసం ప్రయత్నాలు చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. 'ఐకాన్ - కనబడుటలేదు' ప్రాజెక్ట్ గురించి వస్తున్న వార్తల్లో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే.

# మరోసారి జత కట్టిన విజయ్ దేవరకొండ - రష్మిక..!




టాలీవుడ్ లో సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ - లక్కీ బ్యూటీ రష్మిక మందన్నా జోడీకి ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'గీతగోవిందం' సినిమాలో 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే' అంటూ ఆన్ స్క్రీన్ రొమాన్స్ పండించిన ఈ జంట.. 'డియర్ కామ్రేడ్' మూవీతో మరోసారి జతకట్టారు. సిల్వర్ స్క్రీన్ పై మంచి జోడీ అనిపించుకున్న వీరిద్దరూ రియల్ లైఫ్ లో రిలేషన్ షిప్ లో ఉన్నారని అప్పట్లో పుకార్లు ఓ రేంజ్ లో పుట్టుకొచ్చాయి. హీరో రక్షిత్ శెట్టితో రష్మిక ఎంగేజ్మెంట్ క్యాన్సిల్ అవడానికి కారణం ఇదేనని గుసగుసలు వినిపించాయి. కానీ ఇవేవీ పట్టించుకోని ఈ క్రేజీ జంట.. ఎవరి పనుల్లో వాళ్లు బిజీ అయ్యారు. అయితే ఇప్పుడు మరోసారి విజయ్ - రష్మిక కలిసి నటించినట్లు తెలుస్తోంది. కాకపోతే అది ఏ సినిమా కోసమో అనుకుంటే పొరపాటే. వీరిద్దరూ కలిసి నటించింది ఓ కమర్షియల్ యాడ్ కోసం.సంతూర్ ప్రొడక్ట్ కొత్త బ్రాండ్ అంబాసిడర్స్ గా విజయ్ దేవరకొండ - రష్మిక మందన్నా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా వీరిద్దరితో ఇటీవల యాడ్ షూటింగ్ చేసినట్లు తెలుస్తోంది. విజయ్ మోకాళ్లపై కూర్చొని రష్మికకు ఓ గిఫ్ట్ అందిస్తున్నట్లు ఈ యాడ్ లో కనిపిస్తున్నారు. వెండితెరపై ఫర్ఫెక్ట్ పెయిర్ అనిపించుకున్న విజయ్ - రష్మిక సంతూర్ యాడ్ తో మరోసారి అలరించబోతున్నారు. ఇకపోతే వీరిద్దరూ ఇప్పుడు బాలీవుడ్ లో సత్తా చాటే ప్రయత్నాల్లో ఉన్నారు. విజయ్ 'లైగర్' అనే పాన్ ఇండియా సినిమా చేస్తుంటే.. 'మిషన్ మజ్ను' సినిమాతో రష్మిక బాలీవుడ్ లో అడుగుపెడుతోంది. రెండు సినిమాల షూటింగ్స్ ముంబై లోనే జరుగుతుండటంతో ఇద్దరూ వీలైనప్పుడల్లా కలుస్తున్నారని తెలుస్తోంది.

# వైరల్ అవుతున్న బాలీవుడ్ వాతి..!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఎప్పటికప్పుడు న్యూ ట్రెండ్ ఫాలో అయ్యే సెలబ్రిటీలలో ఒకరు. తాజాగా దీపికా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఓ న్యూ వీడియో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో ఆమె ముంబై నగర వీధుల్లో స్టైల్ గా నడుస్తుంటే బాక్గ్రౌండ్ లో మాస్టర్ సినిమా 'వాతి కమింగ్' సాంగ్ వినిపించడం ఆశ్చర్యంగా ఉంది. చూస్తుంటే దీపికా వాతి కమింగ్ పాటకు వీరాభిమానిలా అనిపిస్తుంది. తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన మాస్టర్ సినిమా సాంగ్ ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్స్ రీల్స్ లో కూడా వినిపిస్తుందంటే ఆ పాటకు ఉన్నటువంటి క్రేజ్ అలాంటిది. దాదాపు గతేడాది నుండి వాతి కమింగ్ సాంగ్ సౌత్ లో ఓ ఊపు ఊపేసింది.అయితే దీపికా షేర్ చేసిన వీడియోలో ఆమె నడుస్తూ మోంటేజ్ లుక్కులో కనిపించడం ఆకట్టుకుంటుంది. బీటిఎస్ ఆఫ్ బీటిఎస్ అనే కాప్షన్ జోడించి దీపిక పోస్ట్ చేసింది. ఈ వీడియో చూస్తూ దీపికా అభిమానులు అటు దళపతి అభిమానులు ఉత్సాహంగా వారి అభిప్రాయాలను షేర్ చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో దీపికా చాలా యాక్టీవ్. ఎప్పటికప్పుడు తన గురించి సినిమాల గురించి ప్రేక్షకులతో షేర్ చేసుకుంటుంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం అమ్మడు చాలా సినిమాలను ఓకే చేసింది. భర్త రన్వీర్ సింగ్ తో 83లో నటిస్తూనే.. శకున్ బాత్రాతో ఓ సినిమా సిద్దార్థ్ ఆనంద్ తో ఫైటర్ అలాగే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో ఓ మూవీ చేయనుంది. అలాగే అమ్మడు నిర్మాతగా హాలీవుడ్ 'ది ఇంటర్న్' మూవీ రీమేక్ చేస్తోంది.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190